మీరే చదువరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

నేటి ఈవార్తలు
NETI EVARTHALU
దినపత్రిక

మీరే విలేకరి..
క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి..
మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

సోమవారం MONDAY 27-10-2025 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 117 Issue: 117

27 అక్టోబర్ 2025 - సోమవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం - శరత్ ఋతువు కార్తీక మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:16 సూర్యాస్తమయం - సా. 5:43 తిథిః షష్ఠి ఉ. 8:00o వరకు సంస్కృత వారం ఇందు వాసరః నక్షత్రం మూల మ. 1:17 వరకు తరువాత పూర్వాషాఢ యోగం అతిగండ ఉ. 7:23 వరకు కరణం కౌలవ రా. 7:02 వరకు తైతుల ఉ. 8:00o వరకు వర్జ్యం రా. 11:58 నుండి రా. 1:43 వరకు దుర్ముహూర్తం మ. 2:40 నుండి మ. 3:26 వరకు మ. 2:40 నుండి మ. 3:26 వరకు రాహుకాలం ఉ. 7:42 నుండి ఉ. 9:08 వరకు యమగండం ఉ. 10:34 నుండి ఉ. 11:59 వరకు గుళికాకాలం మ. 1:25 నుండి మ. 2:51 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:40 నుండి తె. 5:28 వరకు అమృత ఘడియలు ఉ. 6:24 నుండి ఉ. 8:11 వరకు అభిజిత్ ముహూర్తం ఉ. 11:37 నుండి మ. 12:22 వరకు గమనిక: "o" అనగా మరుసటి రోజున

Published from Jagitial
www.evarthalu.com

# 'లక్కీడ్రా'ప్ ఎవరిదో..!

## నేడే వైన్ షాపులకు లక్కీడ్రా.. 2,620 దుకాణాలకు 95,137 అప్లికేషన్లు

### అత్యధికంగా శంషాబాద్‌లో 100 వైన్స్‌కు 8,536 .. వనపర్తిలో 37 వైన్స్‌కు 757 దరఖాస్తులే



హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): మద్యం దుకాణాల లక్కీ డ్రాకు ఎక్సైజ్ ఆఫీసర్లు ఏర్పాట్లు చేసేశారు. సోమవారం (నేడు) ఉదయం 11 గంటలకు డ్రా నిర్వహణకు సన్నద్ధం కావాలని ఎక్సైజ్ కమిషనర్ సి.హరికిరణ్ సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లాల వారీగా దరఖాస్తుదారులు, ఎక్సైజ్ అధికారుల సమక్షంలో జిల్లా కలెక్టర్ల చేతుల మీదుగా డ్రా ప్రక్రియను కొనసాగనుంది. రాష్ట్రంలోని మొత్తం 2,620 మద్యం తరువాయి 2 వ పేజీలో...



# తాగి డ్రైవింగ్ చేసేవాళ్లు టెర్రరిస్టులు

## హైదరాబాద్ సీపీ సజ్జనార్.. కర్నూలు బస్సు ప్రమాదంపై తీవ్ర స్పందన

### తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్లే ఘోరం జరిగిందని వెల్లడి

మద్యం సేవించి వాహనాలు నడిపేవారు టెర్రరిస్టులతో సమానమని సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై వారి చర్యలు ఉగ్రవాద చర్యల కన్నా ఏమాత్రం తక్కువ కాదని ఆయన అభిప్రాయపడ్డారు.

# 4.5 కోట్ల గంజాయి సీజ్

## బ్యాంకాక్ నుంచి స్మగ్లింగ్... శంషాబాద్ ఎయిర్‌పోర్టులో పట్టివేత



శంషాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): అధికారుల కండ్లు కప్పి విదేశీ హైడ్రోపోనిక్ గంజాయిని తరలించడానికి ప్రయత్నించిన ఓ వ్యక్తిని శంషాబాద్ ఎయిర్ పోర్టులో డీఆర్ఐ అధికారులు పట్టుకున్నారు. ఆదివారం బ్యాంకాక్ నుంచి వచ్చిన ఓ భారత ప్రయాణికుడిని శంషాబాద్ ఎయిర్ పోర్టులో తనిఖీ చేయగా హైడ్రోపోనిక్ గంజాయి తరలిస్తున్నట్లు డీఆర్ఐ అధికారులు స్కానింగ్‌లో కనుగొన్నారు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ప్రయాణికుడిని అదుపులోకి తీసుకున్నారు. లగేజ్‌ని -2 వ పేజీలో...

# కుమ్రం భీం స్ఫూర్తి

## ఆయన తరతరాలకు ధైర్యం..



### గిరిజన సమాజంపై చెరగని ముద్ర
### నిజాంపై పోరుకు కొత్త బలాన్నిచ్చారు
### 20 ఏళ్ల వయసులోనే ఎదిరించాడు
### మన్ కీ బాత్‌లో ప్రధాని మోదీ



కుమ్రం భీం తరతరాలకు స్ఫూర్తి అని ప్రధాని మోదీ కొనియాడారు. ఆదివారం 'మన్ కీ బాత్'లో "జల్, జంగల్, జమీన్ హమారా" నినాదం కోసం ప్రాణాలర్పించిన ఆదివాసీ పోరాట యోధుడు కుమ్రం భీం గురించి మోదీ ప్రస్తావించారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన కుమ్రం భీంకు మోదీ ఈ సందర్భంగా నివాళులర్పించారు. భీం ధైర్యం, త్యాగం గురించి ప్రస్తావించిన మోదీ.. ఆయన లక్షలాది మంది హృదయాలపై, ముఖ్యంగా గిరిజన సమాజంలో చెరగని ముద్ర వేశారని అన్నారు.

న్యూఢిల్లీ: కుమ్రం భీం కథ తరతరాలకు స్ఫూర్తినిస్తూనే ఉంటుందని కూడా ప్రధాని మోదీ చెప్పారు. 'ఇప్పుడు నేను మిమ్మల్ని గతస్మృతిలోకి తీసుకెళ్తాను. 20వ శతాబ్దం ప్రారంభంలో ఊహించుకోండి! ఆ సమయంలో స్వేచ్ఛకు ఎక్కడా అవకాశం లేదు. బ్రిటిష్ వారు భారతదేశం అంతటా దోపిడీ చేస్తూ అన్ని హద్దులను దాటేశారు. ఆ కాలంలో హైదరాబాద్‌లో దేశభక్తిగల ప్రజలపై అణచివేత మరింత భయంకరమైనదిగా ఉండేది. వారు క్రూరమైన, కనికరం లేని నిజాం దురాగతాలను కూడా భరించవలసి వచ్చింది. అప్పుడు పేదలు, అణగారిన, గిరిజన వర్గాలపై జరిగిన దారుణాలకు అవధులు లేవు. వారి భూములను లాక్కున్నారు. భారీ పన్నులు కూడా విధించారు. ఈ అన్యాయానికి వ్యతిరేకంగా నిరసన తెలిపినవారి చేతులు కూడా నరికివేయబడ్డాయి' అని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అప్పుడు యువకుడిగా ఉన్న కుమ్రం భీం... ఈ నిరంకుశత్వానికి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారని ప్రధాని మోదీ గుర్తుచేసుకున్నారు. 'అటువంటి క్లిష్ట సమయాల్లో, సుమారు 20 సంవత్సరాల వయస్సు గల యువకుడు ఈ అన్యాయానికి వ్యతిరేకంగా నిలబడ్డాడు. ఈ రోజు నేను తరువాయి 2 వ పేజీలో...





# ఇందిరమ్మ ఇళ్లలో ఉపాధి

## బిల్లుల చెల్లింపుల్లో మార్పులు.. స్లాబ్ పడ్డాక పడేది 1.4 లక్షలే

### మిగతా 60 వేలు నరేగా కింద జమ.. మంత్రి పొంగులేటి వెల్లడి

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేయనున్న 'ఇందిరమ్మ ఇళ్ల పథకం' చెల్లింపుల విషయంలో స్వల్ప మార్పులు చేసింది. మొత్తం రూ. 5 లక్షల ఆర్థిక సహాయాన్ని నాలుగు విడతలుగా అందించే ఈ పథకంలో.. చెల్లింపు విధానం మారుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు.

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): గతంలో ఉన్న విధానం ప్రకారం.. ఇల్లు కట్టే నిర్మాణ దశల ఆధారంగా లబ్ధిదారులకు డబ్బులు జమ అయ్యేవి. ఇప్పుడు ఈ విధానంలో స్లాబ్ వేసిన తర్వాత చెల్లించే మూడో విడతలో మార్పు చేశారు. మొదటి రెండు విడతలుయథావిధిగా బేస్‌మెంట్ వరకు రూ. 1,00,000.. రూఫ్ లెవల్ వరకు రూ. 1,00,000 ఖాతాలో జమ అవుతాయి. మూడో విడత (స్లాబ్ దశ)లో గతంలో రూ. 2,00,000 ఇచ్చేవారు. ఇప్పుడు ఇందులో రూ. 1,40,000 మాత్రమే నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లోకి విడుదల అవుతాయని మంత్రి తెలిపారు. మిగిలిన రూ. 60,000 మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ తరువాయి 2 వ పేజీలో...

# పార్టీ రిజర్వేషన్లు ఒప్పుకోం

## ఆర్ కృష్ణయ్య స్పష్టీకరణ



స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై బీసీ జేఏసీ చైర్మన్, రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య కీలక వ్యాఖ్యలు చేశారు. పాత పద్ధతిలో ఎన్నికలు నిర్వహిస్తామంటే ఒప్పుకునే ప్రసక్తే లేదని అన్నారు. ఆదివారం మీడియాతో మాట్లాడిన ఆయన.. పార్టీ పరంగా రిజర్వేషన్లు ఇస్తే అంగీకరించబోమన్నారు.

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు పెంచుకోవచ్చని సుప్రీంకోర్టు చెప్పిందని సరైన వాదనలు వినిపిస్తే కోర్టు స్టే ఎందుకు ఇస్తుందని ప్రశ్నించారు. బీసీల తరఫున హైకోర్టులో వాదనలు వినిపిస్తామని అవసరం అయితే సుప్రీంకోర్టుకు తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.12,562 |
| వెండి (గ్రాము): | రూ.170 |
| ప్లాటినం (గ్రాము): | రూ.4,528 |

# దండుపాళ్యం పాలన

## అలీబాబా దొంగల ముఠా

## రౌడీ షీటర్ల చేతుల్లో రాష్ట్రం

### బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్



హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): తెలంగాణలో దండుపాళ్యం ముఠా పాలన నడుస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఘాటు వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ భవన్‌లో తెలంగాణ హోటల్స్ కార్మిక యూనియన్ నేతలతో ఆయన సమావేశం నిర్వహించారు. పలువురు హోటళ్ల కార్మిక నాయకులు బీఆర్ఎస్ పార్టీలో చేరారు. వీరికి కేటీఆర్ గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడారు. హోటల్‌లో పనిచేసే కార్మికులు బతుకుదెరువు కోసం హైదరాబాద్‌కు వచ్చారని.. బీఆర్ఎస్ హయాంలో తరువాయి 2 వ పేజీలో...

# సీఎం మంత్రుల తన్నులాట

## కాంగ్రెస్‌ది ఇంట్లో ఈగల మోత

## బయట పల్లకిల మోత

### మాజీమంత్రి హరీశ్ రావు



హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): కాంగ్రెస్‌ది ఇంట్లో ఈగల మోతా.. బయట పల్లకిల మోతా అని బీఆర్ఎస్ మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. పంపకాల్లో తేడా వచ్చి మంత్రులు, ముఖ్యమంత్రి తన్నుకుంటున్నారని ఆరోపించారు. తెలంగాణ భవన్‌లో వడ్డెర సంఘం నాయకులతో ఆదివారం జరిగిన సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, హరీశ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా హరీశ్ రావు మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం వడ్డెర సమాజానికి సహాయం చేసిందని చెప్పారు. సిద్దిపేటలో ట్రాక్టర్లు అందించామని తరువాయి 2 వ పేజీలో...

# కాంగ్రెస్ మునిగిపోయే పడవ

## బీఆర్ఎస్ ఏకపక్షంగా నన్ను బయటకు పంపింది

## తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

### రెండో రోజు నిజామాబాద్‌లో 'జనంబాట'



నిజామాబాద్, అక్టోబర్ 26(ఈవార్తలు): బీఆర్ఎస్ ఏకపక్షంగా తనను బయటకు పంపిందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత ఆవేదన వ్యక్తం చేశారు. బీఆర్ఎస్‌లో అన్ని బాధ్యతలకు తాను రాజీనామా చేసి.. మళ్లీ జనం ముందుకు వచ్చానని చెప్పుకొచ్చారు. ఎవరి పనితీరు ఏమిటో రివ్యూ చేసుకుని ఉంటే మొన్నటి ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓడిపోయేది కాదని తెలిపారు. జనంబాటకు చాలామంది అండగా నిలుస్తున్నారని వ్యాఖ్యానించారు. జనంబాట చేపట్టిన తనపై ఓ ఎంపీ లేనిపోని ఆరోపణలు చేశారని తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



జపాన్ వ్యాపారులు గొప్ప నిర్ణయం తీసుకున్నారు. పండించే కూరగాయలు, పంటల వద్ద ఆయా రైతుల ఫొటోలను ఏర్పాటు చేస్తున్నారు. వ్యవసాయంలో పారదర్శకత, స్థానికతను ప్రోత్సహించే దిశగా అక్కడి వ్యాపారులు ఈ నిర్ణయం తీసుకున్నారు.



# హిడ్మా లొంగిపోతారా?


## లొంగిపోయే అవకాశం ఉందని నిఘా వర్గాల అంచనా

## ఇటీవలే వరంగల్‌లో లొంగిపోయిన హిడ్మా కుమార్తె కేశా

## అనుచరులతో కలిసి ఆయుధాలు అప్పగించే అవకాశం

మావోయిస్టు పార్టీ అగ్ర నాయకుడు, దండకారణ్యం స్పెషల్ జోనల్ కమిటీ కార్యదర్శి మడావి హిడ్మా అలియాస్ సంతోష్ లొంగిపోతారనే ప్రచారం జోరుగా సాగుతోంది. తన అనుచరులతో కలిసి తెలంగాణ పోలీసుల ఎదుట హిడ్మా ఆయుధాలు అప్పగించే అవకాశాలున్నాయని రాష్ట్ర నిఘా వర్గాలు అంచనా వేస్తున్నాయి.

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): ఈ ప్రచారాన్ని ఛత్తీస్‌గఢ్ పోలీసులు తోసిపుచ్చుతున్నప్పటికీ, తెలంగాణ ఇంటెలిజెన్స్ వర్గాలు మాత్రం ఈ విషయాన్ని తేలిగ్గా తీసుకోవడం లేదు. పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (పీఎల్‌జీఏ) ప్లాటూన్-1 కమాండర్‌గా, కేంద్ర కమిటీ సభ్యుడిగా ఉన్న హిడ్మా.. గెరిల్లా దాడుల వ్యూహరచనలో అత్యంత నిపుణుడిగా పేరుగాంచాడు. గతంలో భద్రతా బలగాలపై జరిగిన అనేక భారీ దాడులకు తరువాయి 2 వ పేజీలో...




# ముంచుకొస్తున్న 'మొంథా'

## బంగాళాఖాతంలో బలపడిన తీవ్ర వాయుగుండం

## 28న కాకినాడ వద్ద తీరం దాటనున్న తుపాను

## తీరం దాటే సమయంలో 110 కి.మీ వేగంతో గాలులు

### మత్స్యకారులు వేటకు వెళ్లవద్దని హెచ్చరికలు

వైజాగ్, అక్టోబర్ 26 (ఈవార్తలు): బంగాళాఖాతంలో ఏర్పడిన 'మొంథా' తుపాను ప్రభావంతో ఆంధ్రప్రదేశ్‌లో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురవనున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ శాఖ రేపు (అక్టోబర్ 27) రాష్ట్రంలోని ఏడు జిల్లాలకు రెడ్ అలర్ట్ జారీ చేసింది. పొట్టిశ్రీరాములు నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, కృష్ణా, పశ్చిమ గోదావరి, కోనసీమ, కాకినాడ జిల్లాల్లో అత్యంత తరువాయి 2 వ పేజీలో...

## రాశి ఫలాలు

27.10.2025

మేషం: వ్యాపారమున సొంత నిర్ణయాలతో లాభాలు అందుకుంటారు. చేపట్టిన పనులలో యత్నకార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగులకు నూతన ఉద్యోగప్రాప్తి. ఉద్యోగమున అధికారుల అనుగ్రహం పొందుతారు. చిన్ననాటి మిత్రులతో శుభకార్యాలలో పాల్గొంటారు. బంధువులతో విభేదాలు తొలగుతాయి.

వృషభం: ఆధ్యాత్మిక చింతన పెరుగుతుంది. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. మిత్రులతో వివాదాలు మానసికంగా చికాకుగా కలిగిస్తాయి. దూరప్రయాణాలు వాయిదా వెయ్యడం మంచిది. వ్యాపార, ఉద్యోగాలలో కొంత అసంతృప్తి తప్పదు. ముఖ్యమైన వ్యవహారాలలో కష్టించినా ఫలితం కనిపించదు. సోదరులతో స్థిరాస్తి వివాదాలు ఉంటాయి.

మిధునం: వృత్తి వ్యాపారాలలో ఆకస్మికంగా కొన్ని నిర్ణయాలు మార్చుకుంటారు. బంధుమిత్రులతో స్వల్ప వివాదాలు ఉంటాయి. పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమవుతుంది. చేపట్టిన పనులలో కష్టానికి తగిన ఫలితం లభించదు. కుటుంబ వ్యవహారాల్లో తొందరపాటు పనిచేయదు.

కర్కాటకం: స్థిరాస్తి క్రయ విక్రయాలు లాభసాటిగా సాగుతాయి. ప్రముఖుల నుంచి కీలక సమాచారం అందుతుంది. వ్యాపారమున అంచనాలు అందుకుంటారు. ఉద్యోగాలలో సమస్యలు తీరతాయి. చిన్ననాటి మిత్రులతో విందు వినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. కొన్ని పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

సింహం: ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. బంధువుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపారాలు విస్తరిస్తారు. నిరుద్యోగ ప్రయత్నాలు సానుకూలమవుతాయి. భాగస్వామితో శుభకార్యాలకు హాజరవుతారు. ఆర్థిక లావాదేవీలు ఆశాజనకంగా సాగుతాయి.

కన్య: ఉద్యోగమున ఉన్నతాధికారులతో అప్రమత్తంగా వ్యవహరించాలి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన విషయాలు తెలుస్తాయి. ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. విద్యార్థుల శ్రమ ఫలించదు. చేపట్టిన పనులు వాయిదా వేస్తారు. బంధువర్గంతో వివాదాలు తప్పవు.

తుల: ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనుల్లో అవాంతరాలు తప్పవు. బంధువులతో అకారణ వివాదాలు కలుగుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ఊహించని సమస్యలు ఉంటాయి. దూరప్రయాణాలు వాయిదా పడతాయి. కుటుంబ సభ్యులతో ఆలయాలు సందర్శిస్తారు.

వృశ్చికం: పుణ్యక్షేత్రాలు సందర్శిస్తారు. వ్యాపారాలు సాఫీగా సాగుతాయి. నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ఆత్మీయులతో సఖ్యతగా వ్యవహరిస్తారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. విందు వినోద కార్యక్రమాలకు ఆహ్వానాలు అందుతాయి. స్థిరాస్తి కొనుగోలు ప్రయత్నాలు ఫలిస్తాయి.

ధనస్సు: సోదరులతో స్థిరస్తి వివాదాలలో నూతన ఒప్పందాలు చేసుకుంటారు. సన్నిహితులతో మాట పట్టింపులు ఉంటాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. వ్యాపారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. ఉద్యోగాలలో గందరగోళ పరిస్థితులు ఉంటాయి. ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ పరుస్తుంది. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

మకరం: విలువైన వస్తు వాహన లాభాలు పొందుతారు. ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు కలుగుతాయి. ఉద్యోగాలలో మీ ప్రతిభ వెలుగులోకి వస్తుంది. నిరుద్యోగులకు నూతన అవకాశాలు అందుతాయి. సంఘంలో గౌరవ మర్యాదలకు లోటు ఉండదు. స్థిరస్తి క్రయవిక్రయాలలో నూతన లాభాలను అందుకుంటారు.

కుంభం: వ్యాపార ఉద్యోగాలలో ఊహించని సమస్యలు తప్పవు. చేపట్టిన వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. ఆర్థిక ఇబ్బందులు చికాకు పరుస్తాయి. దైవ కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఆర్థిక వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. కుటుంబ సభ్యులతో విభేదాలు తప్పవు. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి.

మీనం: వ్యాపారాలలో నూతన పెట్టుబడులు అందుతాయి. చేపట్టిన/ వ్యవహారాలలో పురోగతి సాధిస్తారు. బంధు మిత్రుల నుండి శుభవార్తలు అందుతాయి. ఉద్యోగాలలో అధికారుల సహాయ సహకారాలు అందుతాయి. ఇంటా బయట అనుకూల వాతావరణం ఉంటుంది. కొత్త వ్యక్తుల పరిచయాలు ఉత్సాహాన్నిస్తాయి.

# ముంచుకొస్తున్న 'మొంథా'

మొదటి పేజీ తరువాయి

భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఈ ప్రాంతాల్లో బలమైన ఈదురుగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. రాష్ట్రంలోని మరో 16 జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేశారు. చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య, కడప, నంద్యాల, పల్నాడు, గుంటూరు, ఎన్టీఆర్, ఏలూరు, తూర్పు గోదావరి, అల్లూరి, అనకాపల్లి, విశాఖపట్నం, పార్వతీపురం, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో అతి భారీ వర్షాలు కురుస్తాయని తెలిపారు. శ్రీ సత్యసాయి, అనంతపురం, కర్నూలు జిల్లాలకు ఎల్లో అలర్ట్ ప్రకటించారు. ఈ జిల్లాల్లోనూ భారీ వర్షాలు పడే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఆగ్నేయ బంగాళాఖాతంలో కొనసాగుతున్న తీవ్ర వాయుగుండం మరింత బలపడి పశ్చిమ–వాయవ్య దిశగా కదులుతోంది. ఇది రాబోయే 24 గంటల్లో 'మొంథా' తుపానుగా మారే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించింది. ప్రస్తుతం ఈ వాయుగుండం కాకినాడకు ఆగ్నేయంగా 830 కిలోమీటర్ల దూరంలో కేంద్రీకృతమై ఉంది. ఈ తుపాను అక్టోబర్ 28వ తేదీ సాయంత్రం లేదా రాత్రి సమయంలో మచిలీపట్నం, కళింగపట్నం మధ్య కాకినాడ సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. తీరం దాటే సమయంలో గంటకు 90 నుంచి 100 కిలోమీటర్ల వేగంతో బలమైన గాలులు వీస్తాయని, గరిష్ఠంగా గాలి వేగం 110 కిలోమీటర్లకు చేరుకోవచ్చని అధికారులు హెచ్చరించారు. తుపాను హెచ్చరికల నేపథ్యంలో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది.

### తెలంగాణలో భారీ వర్షాలకు చాన్స్

తెలంగాణలోని కొన్ని జిల్లాల్లో సోమవారం అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. మంగళవారం కొన్ని ఈశాన్య జిల్లాల్లో అతి భారీ నుంచి అత్యంత భారీ వర్షాలు కురవనున్నట్లు పేర్కొంది. ఉత్తర, ఈశాన్య జిల్లాల్లో భారీ నుంచి అతి భారీ వర్షాలు అక్కడక్కడ కురిసే అవకాశం ఉందని ప్రకటించింది.

# తాగి డ్రైవింగ్ చేసేవాళ్లు టెర్రరిస్టులు

## హైదరాబాద్ సీపీ సజ్జనార్.. కర్నూలు బస్సు ప్రమాదంపై తీవ్ర స్పందన.. తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్లే ఘోరం జరిగిందని వెల్లడి

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): మద్యం సేవించి వాహనాలు నడిపేవారు టెర్రరిస్టులతో సమానమని సీనియర్ ఐపీఎస్ అధికారి వీసీ సజ్జనార్ సంచలన వ్యాఖ్యలు చేశారు. రోడ్లపై వారి చర్యలు ఉగ్రవాద చర్యల కన్నా ఏమాత్రం తక్కువ కాదని ఆయన అభిప్రాయపడ్డారు. 20 మంది ప్రాణాలను బలిగొన్న కర్నూలు బస్సు ప్రమాదం నిజానికి ప్రమాదం కాదని, అది ఒక తాగుబోతు బైకర్ నిర్లక్ష్యం వల్ల జరిగిన దారుణ మారణకాండ అని ఆయన తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేశారు. కర్నూలు ప్రమాద ఘటన వివరాలను సజ్జనార్ పంచుకున్నారు. బి. శివ శంకర్ అనే బైకర్ మద్యం మత్తులో తన బైక్‌పై నియంత్రణ కోల్పోవడం వల్లే ఈ ఘోరం జరిగిందని తెలిపారు. తెల్లవారుజామున 2:24 గంటలకు ఓ పెట్రోల్ బంకులో బైక్‌లో ఇంధనం నింపుకున్న దృశ్యాలు సీసీటీవీ ఫుటేజీలో నమోదయ్యాయని, సరిగ్గా 2:39 గంటలకు ఈ ఘోర ప్రమాదం జరిగిందని ఆయన వివరించారు. అతని బాధ్యతారాహిత్యం క్షణాల్లో ఎన్నో కుటుంబాలను సర్వనాశనం చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. "మద్యం తాగి వాహనాలు నడిపేవారు ప్రతీ విషయంలోనూ టెర్రరిస్టులే. నేను నా మాటకు కట్టుబడి ఉన్నాను. వారు ప్రాణాలను, కుటుంబాలను, భవిష్యత్తును నాశనం చేస్తారు. ఇలాంటి చర్యలను ఎప్పటికీ సహించబోం," అని సజ్జనార్ స్పష్టం చేశారు. ఇకపై హైదరాబాద్‌లో డ్రంక్ డ్రైవింగ్‌పై జీరో టాలరెన్స్ విధానాన్ని అవలంబిస్తున్నట్లు సజ్జనార్ ప్రకటించారు. మద్యం మత్తులో పట్టుబడిన ప్రతి ఒక్కరూ చట్టం యొక్క పూర్తి పరిణామాలను ఎదుర్కోవలసి ఉంటుందని హెచ్చరించారు. అమాయకుల జీవితాలను ప్రమాదంలో పడేసే వారి పట్ల ఎలాంటి కనికరం, మినహాయింపులు ఉండవని తేల్చిచెప్పారు. డ్రంక్ డ్రైవింగ్‌ను ఒక పొరపాటుగా చూడటం సమాజం మానుకోవాలని, అది జీవితాలను నాశనం చేసే నేరమని, దానికి తగ్గ శిక్ష కచ్చితంగా ఉండాలని పేర్కొన్నారు.



# 'లక్కీడ్రా'ప్ ఎవరిదో..!

మొదటి పేజీ తరువాయి

దుకాణాలకు 95,137 దరఖాస్తులు వచ్చాయి. హైదరాబాద్ చుట్టుపక్కల జిల్లాల్లో వైన్స్ కోసం డిమాండ్ భారీగా ఉంది. శంషాబాద్‌లో అత్యధికంగా 100 దుకాణాలకు 8,536 దరఖాస్తులు రాగా, సరూర్‌నగర్‌లో 134 షాపులకు 7,845, మేడ్చల్‌లో 114 షాపులకు 6,063, మల్కాజ్‌గిరిలో 88 షాపులకు 5,168 దరఖాస్తులు వచ్చాయి. జిల్లాల వారీగా చూస్తే, నల్లగొండలో 155 షాపులకు 4,906 దరఖాస్తులు, ఖమ్మంలో 122 షాపులకు 4,430 దరఖాస్తులు, సంగారెడ్డిలో 101 షాపులకు 4,432 దరఖాస్తులు వచ్చాయి. నిర్మల్‌లో 47 షాపులకు 3,002, నిజామాబాద్‌లో 102 షాపులకు 2,786, కరీంనగర్‌లో 94 షాపులకు 2,730, యాదాద్రి భువనగిరిలో 82 షాపులకు 2,776, సిద్దిపేటలో 93 షాపులకు 2,782, సూర్యాపేటలో 99 షాపులకు 2,771, మహబూబ్‌నగర్‌లో 90 మద్యం దుకాణాలకు 2,487, జగిత్యాలలో 71 వైన్స్‌కు 1,966, వరంగల్ అర్బన్‌లో 65కు 3,175 దరఖాస్తులు వచ్చాయి. వరంగల్ రూరల్‌లో 63 షాపులకు 1,958, మహబూబాబాద్‌లో 59 వైన్స్‌కు 1,800, భూపాలపల్లిలో 60 వైన్స్‌కు 1,863, వికారాబాద్‌లో 59 వైన్స్‌కు 1,808 దరఖాస్తులు దాఖలయ్యాయి. మెదక్‌లో 49 షాపులకు 1,920, కామారెడ్డిలో 49 షాపులకు 1,502, రాజన్న సిరిసిల్లలో 48 షాపులకు 1,381, జనగామలో 47 షాపులకు 1,697, పెద్దపల్లిలో 77 వైన్స్‌కు 1,507 అప్లికేషన్లు వచ్చాయి. జోగులాంబ గద్వాల 36 వైన్స్‌కు 774, ఆదిలాబాద్ 40 వైన్స్‌కు 771, వనపర్తిలో 37 వైన్స్‌కు 757 అప్లికేషన్లు వచ్చాయి.

# పార్టీ రిజర్వేషన్లు ఒప్పుకోం

మొదటి పేజీ తరువాయి

వెళ్తామన్నారు. సంవత్సరం నుంచి ఎన్నికలు వాయిదా పడుతున్నాయని మరో రెండు నెలలు వాయిదా పడితే ఏమవుతుందన్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలో ఎన్నికలు నాలుగేళ్లు వాయిదా పడ్డాయని గుర్తు చేశారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కోసం తెలంగాణ తరహా ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు.

# ఇందిరమ్మ ఇళ్లలో ఉపాధి

మొదటి పేజీ తరువాయి

పథకం కింద చెల్లించడానికి నిర్ణయించారు. ఈ నిధులను ప్రధానంగా శ్రామికుల వేతనాల కోసం, నిర్మాణానికి సంబంధించిన పనులకు వినియోగించే అవకాశం ఉంది. చివరి విడత యథావిధిగా రూ. 1,00,000 చెల్లించబడుతుంది. ఈ కొత్త విధానం ద్వారా మొత్తం రూ. 5 లక్షల సాయంలో.. రూ. 4.40 లక్షలు నేరుగా గృహ నిర్మాణానికి, రూ. 60,000 ఉపాధి హామీ ద్వారా శ్రమ ఖర్చుల కోసం అందిస్తారని మంత్రి పేర్కొన్నారు.

# కుమ్రం భీం స్ఫూర్తి

మొదటి పేజీ తరువాయి

ఆ యువకుడి గురించి ఒక ప్రత్యేక కారణం కోసం చర్చిస్తున్నాను. అతని పేరును వెల్లడించే ముందు అతని ధైర్యం గురించి నేను మీకు చెబుతాను. నిజాంకు వ్యతిరేకంగా ఒక మాట మాట్లాడటం కూడా నేరం అయిన ఆ కాలంలో ఆ యువకుడు సిద్ధిఖీ అనే నిజాం అధికారిని బహిరంగంగా సవాలు చేశారు. రైతుల పంటలను జప్తు చేయడానికి సిద్ధిఖీని నిజాం పంపాడు. కానీ అణచివేతకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో సిద్ధిఖీని ఆ యువకుడు చంపారు. అనంతరం అరెస్టును కాకుండా విజయవంతంగా తప్పించుకోగలిగారు. నిజాం నిరంకుశ పోలీసుల నుంచి తప్పించుకుని... ఆ యువకుడు వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న అస్సాంకు చేరుకున్నారు. నేను చెబుతున్న ఆ గొప్ప వ్యక్తి కొమరం భీమ్. ఆయన జయంతి అక్టోబర్ 22న జరిగింది. కొమరం భీమ్ ఎక్కువ కాలం జీవించలేదు. ఆయన కేవలం 40 సంవత్సరాలు మాత్రమే జీవించారు, కానీ ఆయన జీవితకాలంలో లెక్కలేనన్ని మంది ప్రజల హృదయాలపై, ముఖ్యంగా గిరిజన సమాజంపై చెరగని ముద్ర వేశారు. నిజాంకు వ్యతిరేకంగా పోరాడుతున్న వారిలో ఆయన కొత్త బలాన్ని నింపారు. ఆయన వ్యూహాత్మక నైపుణ్యాలకు కూడా ప్రసిద్ధి చెందారు. నిజాం పాలనకు ఆయన పెద్ద సవాలుగా మారారు.

# 4.5 కోట్ల గంజాయి సీజ్

మొదటి పేజీ తరువాయి

తనిఖీ చేయగా ప్రత్యేకంగా తయారు చేసిన సూట్ కేసులో 4.5 కేజీల హైడ్రోపోనిక్ గంజాయి దొరికింది. పట్టుబడిన గంజాయి విలువ సుమారు రూ. 4.5 కోట్లు ఉంటుందని అధికారులు అంచనా వేశారు. ప్రయాణికుడిపై ఎన్డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

# సీఎం మంత్రుల తన్నులాట

మొదటి పేజీ తరువాయి

గుర్తుచేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం మొరం కొట్టుకునే వడ్డెర సోదరులపై అక్రమ కేసులు పెట్టి డబ్బులు వసూలు చేస్తోందన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు హైదరాబాద్‌లో బిల్డింగులు నిర్మించే వడ్డెరసోదరులకు చేతినిండా కూడా పని దొరికేదని గుర్తు చేశారు. కాంగ్రెస్ ప్రజల గురించి చూడడం లేదని.. వాళ్ళు తన్నుకోడానికి, వాటాలు పంచుకోవడానికి సరిపోతుందని హరీశ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. మొన్న కొండా సురేఖ బిడ్డ, నిన్న జూపల్లి కృష్ణారావు ఎలా మాట్లాడుకున్నారో చూశారని.. కేబినెట్ మీటింగ్‌లో ముఖ్యమంత్రి, మంత్రులు తిట్టుకున్నారని వ్యాఖ్యానించారు. మళ్ళీ కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడితేనే ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. హైదరాబాదులో కేసీఆర్ లక్ష డబల్ బెడ్ రూమ్ ఇళ్లు కట్టించారని గుర్తుచేశారు. ఇక రేవంత్ రెడ్డి లక్ష ఇళ్లను కూలగొట్టించాడని ఎద్దేవా చేశారు. పేదల ఇళ్లు కూల్చొద్దంటే, హైడ్రా బంద్ కావాలంటే కాంగ్రెస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. హైదరాబాద్‌లో ఇళ్లు కూలగొట్టినా ప్రజలు తనకే ఓటేశారని రేవంత్ రెడ్డి విర్రవీగుతారని హరీశ్ రావు అన్నారు. ఎన్నికల ముందు మహిళలకు నెలకు రూ. 2500 ఇస్తామని గ్యారెంటీ కార్డు ఇచ్చారని గుర్తు చేశారు. రెండు వేల పెన్షన్ రూ. 4000 చేస్తామన్నారు, చేశారా కాంగ్రెస్ వాళ్ళు? అని ప్రశ్నించారు. రూ. 200 ఉన్న పెన్షన్ ను కేసీఆర్ రూ. 2000 చేశారని కొనియాడారు. మహిళలకు రూ. 2500 రావాలన్నా, వృద్ధులకు రూ. 4000 పెన్షన్ రావాలన్నా జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ను ఓడగొట్టాలని పిలుపునిచ్చారు. ఓటుతో రేవంత్ రెడ్డి చెంపలు వాయించి బుద్ధి చెప్పాలన్నారు. రేవంత్ రెడ్డి డబ్బు మూటలను, గూండాలను నమ్ముకున్నారని ఆరోపించారు. కేటీఆర్, కేసీఆర్‌తో తాను మాట్లాడి వడ్డెర సోదరులు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగాపైకి రావడానికి సంపూర్ణమైన బాధ్యత తీసుకుంటానని హరీశ్ రావు హామీ ఇచ్చారు. ఆరోజు అడగకపోయినా హైదరాబాద్‌లో వడ్డెర సంఘానికి కేసీఆర్ ఎకరం భూమి ఇచ్చారని గుర్తు చేశారు. కేసీఆర్, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్‌లో వడ్డెర ఆత్మగౌరవ భవనానికి స్థలాలను కేటాయించిందని.. దాని నిర్మాణానికి డబ్బులు ఇచ్చిందని తెలిపారు. రేవంత్ రెడ్డి సీఎం అంటే కటింగ్ మాస్టర్ అని ఎద్దేవా చేశారు. రేవంత్ రెడ్డి ఎక్కడా కొత్త స్కీమ్ పెట్టింది లేదని.. కొత్త భవనం కట్టింది లేదని విమర్శించారు. కేసీఆర్ కట్టిన ఫ్లైఓవర్లకు, బిల్డింగ్‌లకు రిబ్బన్లు కట్ చేయడం, కేసీఆర్ పెట్టిన స్కీములను కటింగ్ చేయడం చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ కిట్టు, బతుకమ్మ చీర, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, ఆరోగ్యశ్రీ అన్ని పథకాలకు కత్తెర పెట్టాడని విమర్శించారు. తలసాని శ్రీనివాస్ యాదవ్ ఆధ్వర్యంలో యాదవులకు, కురుమలకు ఆత్మగౌరవ భవనాలను హైదరాబాదులో నిర్మించామన్నారు. రేవంత్ రెడ్డి.. ఒక్క రూపాయి అయినా బీసీల ఆత్మగౌరవ భవన నిర్మాణాలకు ఇచ్చారా? అని ప్రశ్నించారు. బీసీలపై రేవంత్ రెడ్డికి చిత్తశుద్ధి ఉంటే కేసీఆర్ ప్రారంభించిన బీసీ ఆత్మగౌరవ భవనాలకు నిధులు విడుదల చేసి పనులను పూర్తి చేయాలని సవాల్ విసిరారు. వడ్డెర సమాజం రాజకీయంగా, ఆర్థికంగా పైకొచ్చే విధంగా బీఆర్ఎస్ పార్టీ, కేసీఆర్ ఎప్పుడూ అండగా ఉంటారని హామీ ఇచ్చారు. వడ్డెర అంటే బండ జాతి, మొండి జాతి, మాట తప్పని జాతి అని కొనియాడారు. జూబ్లీహిల్స్‌లో మాగంటి సునీతమ్మ భర్తను కోల్పోయి చిన్నపిల్లలతో ఉన్నారని.. గోపీనాథ్ చనిపోతే ఆ కుటుంబాన్ని అనాధలుగా వదిలేయమంటారా? అని ప్రశ్నించారు. భర్త చనిపోతే ఏడ్చిన ఆడపడుచుని కాంగ్రెస్ నాయకులు అవహేళన చేశారని విమర్శించారు. ప్రతి ఒక్కరి ఓటు 11వ తారీఖు రోజు పోలింగ్ బూత్‌కు పోయి సునీతమ్మకు ఓటు వెయ్యాలని కోరారు. కారు మీద ఓటు గుద్దితే రేవంత్ రెడ్డి గువ్వ గుయ్యిమనాలన్నారు.

# హిడ్మా లొంగిపోతారా?

మొదటి పేజీ తరువాయి

హిడ్మానే నాయకత్వం వహించాడని పోలీసు వర్గాలు చెబుతున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా పూవర్తి గ్రామానికి చెందిన హిడ్మా, వందలాది మంది గిరిజన యువతను మావోయిస్టు పార్టీలో చేర్పించి, వారికి సాయుధ శిక్షణ ఇచ్చి పటిష్టమైన సైన్యాన్ని నిర్మించాడు. మోస్ట్ వాంటెడ్ జాబితాలో ఉన్న అతడు పలుమార్లు పోలీసులకు చిక్కినట్లే చిక్కి తప్పించుకున్నాడు. ఇటీవల కాలంలో సోనూ, ఆశన్న వంటి కీలక నేతలతో పాటు వందల మంది మావోయిస్టులు లొంగిపోయారు. ఈ ఏడాది ఫిబ్రవరిలోనే హిడ్మా కుమార్తె వంజెం కేశా అలియాస్ జిన్నీ సైతం వరంగల్ పోలీసుల ఎదుట లొంగిపోయారు. 'ఆపరేషన్ కగార్' తీవ్రం కావడంతో ఆమె పార్టీ నుంచి బయటకు వచ్చారు. ఈ పరిణామాల నేపథ్యంలో ఇప్పుడు హిడ్మా సైతం లొంగిపోవడానికి సిద్ధమవుతున్నారని, వరంగల్‌లో లొంగిపోయే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని నిఘా వర్గాలు భావిస్తున్నాయి. మరోవైపు ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో మావోయిస్టులు ఘాతుకానికి పాల్పడ్డారు. పోలీసు ఇన్ఫార్మర్ల నెపంతో కాంకేర్ గ్రామానికి చెందిన సోది తిరుపతి (35), కట్టం రవి (25) అనే ఇద్దరు గిరిజనులను శుక్రవారం రాత్రి దారుణంగా హత్య చేశారు. మాట్లాడాలని ఇంటి నుంచి బయటకు పిలిచి, కత్తులతో పొడిచి చంపారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర భయాందోళనలు సృష్టించింది.

### 21 మంది మావోయిస్టుల లొంగుబాటు

ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో 21 మంది మావోయిస్టులు ఆదివారంనాడు లొంగిపోయారు. వీరిలో 13 మంది మహిళలు, 9 మంది పురుషులు ఉన్నారు. వీరిలో నలుగురు డీవీసీఎంలు, 9 మంది ఏసీఎంలు, 8 మంది పార్టీ సభ్యులు ఉన్నారు. లొంగిపోయిన మావోయిస్టులు 18 ఆయుధాలను పోలీసులకు స్వాధీనం చేసినట్టు బస్తర్ ఇన్‌స్పెక్టర్ జనరల్ పి.సుందర రాజ్ తెలిపారు. వీరంతా కుమారి/కిస్కోడో ప్రాంత కమిటీ కేష్కల్ డివిజన్ (నార్త్ సబ్ జోనల్ బ్యూరో)కు చెందిన వారని చెప్పారు. లొంగిపోయిన మావోయిస్టులు 3 ఏకే-47 రైఫిల్స్, 4 ఎస్ఎల్ఆర్ రైఫిల్స్, 2 ఇన్సాస్ రైఫిల్స్, 6 పాయింట్ 303 రైఫిల్స్, 2 సింగిల్ షాట్ రైఫిల్స్, ఒక బీజీఎల్ వెపన్ స్వాధీనం చేసినట్టు వివరించారు.

### మునిగిపోయే పడవ

మొదటి పేజీ తరువాయి

ధ్వజమెత్తారు కవిత. ఆదివారం నిజామాబాద్ జిల్లాలో రెండో రోజు కవిత జనంబాట కొనసాగుతోంది. మోపాల్ మండలం బైరాపూర్ గ్రామంలో కవిత పర్యటించారు. ఈ సందర్భంగా కవిత మీడియాతో మాట్లాడారు. ఎంపీ అర్వింద్ రాజీనామా చేస్తే బీసీ బిల్లు అదే వస్తుందని చెప్పుకొచ్చారు. అతని చిట్టా త్వరలోనే బయట పెడతానని హెచ్చరించారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్యను అణచి వేస్తోందని ఫైర్ అయ్యారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. సామాజిక తెలంగాణ కోసం జనంబాట పట్టానని ఉద్ఘాటించారు. ప్రతీ జిల్లాలో చాలా కార్యక్రమాలు చేపడతానని వివరించారు. మునిగిపోయే పడవ కాంగ్రెస్‌తో తనకేం ఏం సంబంధమని కవిత ప్రశ్నించారు. నిజామాబాద్ జిల్లాలోని యంచ గ్రామంలో ముంపు ప్రాంతాలను చూశామన్నారు. అన్నదాతలకి ఎకరానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రూ. 50 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 70 వేల ఎకరాల్లో మొక్కజొన్న రైతులు దగా పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. 80 శాతం మంది రైతులు ధాన్యాన్ని తక్కువ ధరకు అమ్ముకున్నాక కొనుగోలు కేంద్రాలు ఎందుకు పెడుతున్నారని ప్రశ్నించారు. ఈ విషయంలో రేవంత్‌రెడ్డి సర్కార్ మరోసారి ఆలోచించాలని సూచించారు. ధాన్యం కొనుగోలులో అన్నదాతలు ఒక్కో క్వింటాకు రూ.700 నష్టపోయారని వాపోయారు. ధాన్యం తడిసి చెడిపోయిందని తెలిపారు. అటు.. నిజామాబాద్‌లో బీజేపీ ఎంపీ ఉన్నా లేనట్లేనని ఎద్దేవా చేశారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జిని కాంగ్రెస్, బీజేపీ నేతలు ఎందుకు పట్టించుకోవడం లేదని నిలదీశారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జి విషయంలో కేసీఆర్ హయాంలో తమపై ఆరోపణలు చేశారని గుర్తుచేశారు. మాధవనగర్ రైల్వే బ్రిడ్జి ఏర్పాటు చేయకుండా ఇప్పుడూ ఎవరూ అడ్డు పడుతున్నారని కవిత ప్రశ్నించారు. ఇదిలా ఉండగా, నిజామాబాద్ జిల్లాలో రెండో రోజు తెలంగాణ జాగృతి జనంబాట కొనసాగుతోంది. మోపాల్ మండలం బైరాపూర్ గ్రామంలో పోడు భూముల బాధిత రైతు ప్రకాష్ కుటుంబాన్ని పరామర్శించారు కవిత.

# దండుపాళ్యం పాలన

వీరికి ఎలాంటి ఇబ్బంది కలిగించలేదని గుర్తుచేశారు. మంత్రి ఓఎస్డీ తుపాకీతో బెదిరించారని మంత్రి ఇంటికి పోలీసులు వెళ్లారని.. ఆ సమయంలో మంత్రి బిడ్డ బయటకు వచ్చి తుపాకీ ఇచ్చింది రేవంత్ రెడ్డి, రోహిన్ రెడ్డి అని చెప్పారని అన్నారు. మంత్రి భర్త తుపాకీ ఇచ్చారని పోలీసులే అంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో పరిపాలన రౌడీ షీటర్ల పాలన అయిందన్నారు. తుపాకీ రోహిన్ రెడ్డి పెట్టారా? సుమంత్ పెట్టారా? అని ప్రశ్నించారు. రాష్ట్రంలో అలీబాబా దొంగల ముఠాల పాలన తయారైందని దుయ్యబట్టారు. లిక్కర్ బాటిల్స్ స్టిక్కర్ కాంట్రాక్టు కోసం సీఎం అల్లుడు, మంత్రి కొడుకు పోటీపడ్డారని ఆరోపించారు. ఎవరికి చెప్పలేక మంచి ఐఏఎస్ రాజీనామా చేశారని తెలిపారు. హైదరాబాద్ ప్రజలు కాంగ్రెస్ పార్టీని నమ్మలేదని.. అసెంబ్లీ ఎన్నికల్లో ఓఆర్ఆర్ లోపల కాంగ్రెస్ పార్టీకి ఒక్క సీటు రాలేదన్నారు. రెండేళ్లలో రాష్ట్రాన్ని, హైదరాబాద్ నగరాన్ని కాంగ్రెస్ నాశనం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు హామీల్లో కాంగ్రెస్ అర్రాస్ పాట పాడిందన్నారు. రేవంత్ రెడ్డి తిన్న తిట్లు దేశంలో ఏ ముఖ్యమంత్రి తినలేదన్నారు. హైడ్రాలో పేదవాళ్లకు మాత్రమే రూల్స్ ఉంటాయని.. పెద్దవాళ్లకు రూల్స్ ఉండవని ఎద్దేవా చేశారు. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో తెలంగాణకు లాభం చేసే తీర్పు ప్రజలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. రేవంత్ రెడ్డి కుటుంబం, తమ్ముళ్లు, మంత్రులు దోచుకోవడంపై దృష్టి పెట్టారని ఆరోపించారు. జూబ్లీహిల్స్‌లో పోటీ చేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి చరిత్ర ప్రజలకు తెలుసని చెప్పారు. రౌడీషీటర్లను, నేరచరిత్ర ఉన్నవాళ్ళను, బెదిరింపులకు పాల్పడే వాళ్ళను గెలిపిస్తారా? అని అడిగారు. కారు కావాలా? బుల్డోజర్ కావాలా? అని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీకి ఓటు వేస్తే బుల్డోజర్ మీ ఇంటికి వస్తుందని చెప్పారు. కత్తి ఒకరికి ఇచ్చి యుద్ధం ఒకరిని చేయమంటే ఎట్లా? అని వ్యాఖ్యానించారు. రాబందు ప్రభుత్వం పోవాలని.. కేసీఆర్ రైతు ప్రభుత్వం రావాలని ఆకాంక్షించారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలవాలని.. ఎన్నికల్లో ప్రజలు పెద్ద ఎత్తున ఓటింగ్‌లో పాల్గొనాలని అన్నారు. కేసీఆర్‌ను మరోసారి సీఎం చేసే అవకాశం జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలతోనే వచ్చిందని పేర్కొన్నారు.

# 3 నుంచి ప్రైవేట్ కళాశాలల బంద్!

## నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన సమాఖ్య.. ప్రభుత్వం నుంచి రూ. 900 కోట్లు రావాల్సి ఉందని వెల్లడి

**నవంబర్ 1 లోగా చెల్లించాలని ప్రభుత్వానికి డెడ్‌లైన్**

**మంత్రులు పట్టించుకోవడం లేదన్న సమాఖ్య**

**ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరిక**

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను ప్రభుత్వం వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణలోని ప్రైవేట్ విద్యాసంస్థలు ఆందోళన బాట పట్టాయి. ప్రభుత్వం నుంచి రావాల్సిన రూ. 900 కోట్ల బకాయిలను నవంబర్ 1వ తేదీలోగా చెల్లించకపోతే, నవంబర్ 3 నుంచి రాష్ట్రవ్యాప్తంగా ఇంజినీరింగ్, ఇతర వృత్తి విద్యా కళాశాలలను నిరవధికంగా మూసివేస్తామని తెలంగాణ ఉన్నత విద్యా సంస్థల సమాఖ్య స్పష్టం చేసింది. ఈ మేరకు సమాఖ్య ఛైర్మన్ ఎన్. రమేశ్ బాబు ఆదివారం హైదరాబాద్‌లో మీడియాకు వివరాలు వెల్లడించారు. ప్రభుత్వం తమకు మొత్తం రూ. 1200 కోట్ల ఫీజు బకాయిలు ఉండగా, ఇప్పటివరకు కేవలం రూ. 300 కోట్లు మాత్రమే విడుదల చేసిందని రమేశ్ బాబు తెలిపారు. మిగిలిన రూ. 900 కోట్లను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. “ప్రభుత్వం నుంచి మాకు ఎలాంటి సహకారం అందడం లేదు. మంత్రులు కూడా మా సమస్యలను పట్టించుకోవడం లేదు” అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. బకాయిలు చెల్లించకపోతే కాలేజీలను నడపడం కష్టమని, వేలాది మంది విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడుతుందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తమ ఆందోళనను మరింత ఉద్ధృతం చేస్తామని రమేశ్ బాబు హెచ్చరించారు. ప్రభుత్వ వైఖరిలో మార్పు రాకపోతే నవంబర్ 10వ తేదీన సుమారు 2 లక్షల మందితో భారీ సమావేశం నిర్వహిస్తామని ప్రకటించారు. విచారణల పేరుతో ప్రభుత్వం తమను భయపెట్టాలని చూస్తోందని, పోలీసులను పంపితే ఒక్కరిని కూడా కాలేజీ ప్రాంగణంలోకి అనుమతించబోమని ఆయన తేల్చిచెప్పారు.

# బీఆర్ఎస్ చరిత్ర కనుమరుగే ఇక

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో ముగిసిపోతుంది.. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**నవీన్ గెలిస్తేనే జూబ్లీహిల్స్**

**అభివృద్ధి సాధ్యమని వ్యాఖ్య**



జూబ్లీహిల్స్, అక్టోబర్ 26 (ఈవార్తలు): జూబ్లీహిల్స్ నియోజకవర్గానికి జరగబోయే ఉపఎన్నికతో బీఆర్ఎస్ కథకు చరమగీతం పాడబోతున్నామని రాష్ట్ర మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వ్యాఖ్యానించారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి చారిత్రక తీర్పు ఇచ్చి, బీఆర్ఎస్‌ను రాజకీయంగా సమాధి చేయాలని ప్రజలకు ఆయన పిలుపునిచ్చారు. ఆదివారం నాడు జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్‌కు మద్దతుగా వెంగళరావునగర్ డివిజన్‌లో నిర్వహించిన ప్రచార కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ పాలనలో రాష్ట్రం అన్ని విధాలుగా విధ్వంసానికి గురైందని ఆరోపించారు. “బీఆర్ఎస్ పాలన అంటేనే అవినీతి, అణచివేత. ఇప్పుడు ఆ పార్టీకి శాశ్వతంగా ముగింపు పలకాల్సిన సమయం వచ్చింది. ఈ ఉపఎన్నికలో బీఆర్ఎస్‌ను పూర్తిగా తిప్పికొట్టాలి” అని ఆయన కార్యకర్తలకు, ప్రజలకు పిలుపునిచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హైదరాబాద్ నగరాన్ని ఒక ‘మినీ ఇండియా’గా తీర్చిదిద్దేందుకు అద్భుతమైన దార్శనికతతో పనిచేస్తున్నారని తుమ్మల ప్రశంసించారు. జూబ్లీహిల్స్ ఓటర్లు సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వానికి మద్దతుగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. “రేవంత్ రెడ్డి నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి పథంలో దూసుకుపోతోంది. ఈ ప్రగతిని చూసి ఓర్వలేకే ప్రతిపక్షాలు విమర్శలు చేస్తున్నాయి” అని అన్నారు. కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ స్థానికుడు కావడంతో ప్రజల సమస్యలపై పూర్తి అవగాహన ఉందని మంత్రి తుమ్మల తెలిపారు. నవీన్ యాదవ్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో రోడ్లు, విద్య, వైద్యం వంటి మౌలిక సదుపాయాల కల్పనకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. ఆయన గెలుపుతో ఈ ప్రాంత అభివృద్ధి వేగవంతం అవుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. కాగా, జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు నవంబరు 11న పోలింగ్ జరగనుండగా, నవంబరు 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

# అటవీ భూములుగా రెవెన్యూ భూములు

**427 ఎకరాలకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**



హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): ప్రాజెక్టుల నిర్మాణాల్లో ముంపునకు గురైన అటవీ భూములకు ప్రత్యామ్నాయంగా రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ భూములను కేటాయించింది. అటవీ శాఖకు బదలాయించిన భూములను అటవీ శాఖ భూములుగా గుర్తిస్తూ ప్రభుత్వం తాజాగా నోటిఫికేషన్ జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకం నిర్మాణం, మొండికుంట వాగుపై నిర్మించిన మీడియం రిజర్వాయర్ నిర్మాణంలో అటవీ శాఖ భూములు ముంపునకు గురయ్యాయి. ఈ భూమికి బదలాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మరో చోటా ప్రభుత్వ (రెవెన్యూ) భూమిని కేటాయించింది. తాజాగా కేటాయించిన ఈ భూములను అటవీశాఖ భూములుగా నోటిఫై చేస్తూ అటవీ శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాళేశ్వరం ఎత్తిపోతల ప్రాజెక్టు నిర్మాణంలో ముంపునకు గురైన అటవీ భూమికి బదులుగా 399.02 ఎకరాల భూమిని వేరు వేరు సర్వే నెంబర్లలో, వివిధ ప్రాంతాల్లో కేటాయించారు. పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం దొంగతుర్తి గ్రామపరిధి సర్వే నెంబర్ 61 లో మొత్తం 124.23 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. అందులో నుంచి 84.27 ఎకరాల భూమిని అటవీ శాఖకు పరిహారం కింద కేటాయించారు. హనుమకొండ జిల్లా భీమదేవరంపల్లి మండలం గట్ల నర్సింగాపూర్ గ్రామ పరిధిలో సర్వే నెంబరు 340/15/2లో 30.13 ఎకరాలు, సర్వే నెంబర్ 353/14/2 లో 185.17 ఎకరాలు, సర్వే నెంబర్ 355/1/2లో 98.25 ఎకరాలు రెవెన్యూ భూమిని కేటాయించారు. ఈ భూమికి అటవీ శాఖ హద్దులు గుర్తిస్తూ రెవెన్యూ భూమి నుంచి అటవీశాఖ భూమిగా నోటిఫై చేస్తూ నోటిఫికేషన్ ను జారీ చేసింది. ములుగు జిల్లాలో మొండివాగు కుంట పై నిర్మించిన ప్రాజెక్టు నిర్మాణంలో కోల్పోయిని అటవీశాఖ భూమికి బదులుగా ములుగు జిల్లా వాజేడు మండలం లక్ష్మీపురం గ్రామం సర్వే నెంబర్ 50/2 లో ఉన్న 28.20 ఎకరాల ప్రభుత్వ భూమిని అటవీశాఖకు బదలాయించారు. ఈ భూమి అటవీ భూమిగా గుర్తిస్తూ నోటిఫికేషన్ జారీ చేశారు. ఈ భూమి తాలుకు సంబంధించిన సమగ్ర వివరాలు పేర్కొంటూ, సరిహద్దులు ఏర్పాటు చేశారు. అక్షాంశాలు, రేఖాంశాలను గుర్తించారు. ఈ భూములకు సంబంధించిన గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయాలని అటవీశాఖ సంబంధిత జిల్లాల కలెక్టర్లను ఆదేశించింది.

# డీసీపీ చైతన్య ధైర్యం అమోఘం

**రాష్ట్ర డీజీపీ శివధర్‌రెడ్డి**





హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): చాదర్‌ఘాట్‌లో సెల్‌ఫోన్ దొంగలను పట్టుకునే ప్రయత్నంలో గాయపడిన డీసీపీ చైతన్యకుమార్‌ను, ఆయన గన్‌మ్యాన్‌ను తెలంగాణ డీజీపీ శివధర్‌రెడ్డి పరామర్శించారు. హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సజ్జనార్‌తో కలిసి సోమాజిగూడలోని యశోదా ఆసుపత్రికి వెళ్లిన ఆయన, చికిత్స పొందుతున్న డీసీపీ ఆరోగ్య పరిస్థితి గురించి వైద్యులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం డీసీపీ చైతన్యకుమార్‌తో మాట్లాడారు. ఆసుపత్రి వద్ద మీడియాతో మాట్లాడిన డీజీపీ శివధర్‌రెడ్డి, డీసీపీ చైతన్యకుమార్ ఆరోగ్యం నిలకడగా ఉందని, మెరుగుపడుతోందని తెలిపారు. “సోమవారం ఆయన్ను డిశ్చార్జ్ చేసే అవకాశం ఉంది. డీసీపీ చైతన్యకుమార్ ఒక ఆదర్శవంతమైన అధికారి. విధి నిర్వహణలో భాగంగా ఆయన చూపిన చొరవ, ధైర్యసాహసాలు ప్రశంసనీయం. దొంగ చేతిలో కత్తి ఉందని తెలిసినా వెనకడుగు వేయకుండా అతడిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఆయనతో పాటు గన్‌మ్యాన్ కూడా అంతే ధైర్యాన్ని ప్రదర్శించారు. పోలీస్ శాఖ తరపున వారిద్దరినీ అభినందిస్తున్నాం” అని డీజీపీ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ ప్రాంతంలో సెల్‌ఫోన్ దొంగతనాలకు పాల్పడుతున్న ఒమర్ అన్సారీ అనే వ్యక్తిని పట్టుకోవడానికి డీసీపీ చైతన్యకుమార్ స్వయంగా రంగంలోకి దిగారు. ఈ క్రమంలో నిందితుడు కత్తితో డీసీపీపై దాడికి యత్నించాడు. ఆత్మరక్షణ కోసం డీసీపీ కాల్పులు జరపగా, నిందితుడు గాయపడ్డాడు. ఈ ఘటనలో డీసీపీతో పాటు ఆయన గన్‌మ్యాన్‌కు కూడా స్వల్ప గాయాలయ్యాయి. గాయపడిన దొంగ ఒమర్ అన్సారీకి కూడా ఆసుపత్రిలో శస్త్రచికిత్స జరిగిందని, ప్రస్తుతం అతను కోలుకుంటున్నాడని డీజీపీ తెలిపారు. చైతన్యకుమార్ వంటి అధికారుల వల్లే సమాజంలో భద్రతాభావం పెరుగుతుందని, వారి చర్యలు పోలీస్ బలగాలకు స్ఫూర్తినిస్తాయని శివధర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు.

## సిరిసిల్లలో పాముకాటుకు 18 నెలల చిన్నారి బలి

సిరిసిల్ల, అక్టోబర్ 26 (ఈవార్తలు): రాజన్న సిరిసిల్ల జిల్లాలో విషాదం నెలకొంది. ఓ 18 నెలల చిన్నారి పాము కాటుకు బలైంది. దీంతో తల్లిదండ్రులు గుండెలవిసేలా రోదించారు. వివరాల్లోకి వెళ్తే.. చందుర్తి మండలం అసిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రమేశ్, సుమలత అనే దంపతులు తమ బిడ్డ(18 నెలలు) వేదాన్షితో కలిసి నివాసం ఉంటున్నారు. అయితే పసిపాప శనివారం రాత్రి తన ఇంటి ముందు ఆడుకుంటుండగా, పాము కాటేసింది. చిన్నారి ఆ నొప్పి భరించలేక గట్టిగా ఏడ్చింది. దీంతో అప్రమత్తమైన తల్లిదండ్రులు పాపను చికిత్స నిమిత్తం సమీప ఆస్పత్రికి తరలించారు. అప్పటికే చిన్నారి చనిపోయినట్లు వైద్యులు నిర్ధారించారు. వేదాన్షి మృతితో రమేశ్, సుమలత గుండెలవిసేలా రోదించారు. కుటుంబ సభ్యులు, బంధువులు శోకసంద్రంలో మునిగిపోయారు.

## రేవంత్ ప్రచార షెడ్యూల్ ఖరారు



హైదరాబాద్,అక్టోబర్ 26 (ఈవార్తలు): సీఎం రేవంత్‌రెడ్డి జూబ్లీహిల్స్ ఎన్నికల ప్రచార షెడ్యూల్ ఖరారైంది. అక్టోబర్ 28వ తేదీనగ బహిరంగ సభతో జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారాన్ని న రోడ్ షోతో ఆరంభించనున్నారు. ఈ విషయాన్ని కాంగ్రెస్ ఆదివారం(అక్టోబర్ 26వ తేదీ) వెల్లడించారు. నాలుగు రోడ్ షోలు, ఒక బహిరంగ సభలో సీఎం రేవంత్ పాల్గొంటారని కాంగ్రెస్ స్పష్టం చేసింది. ఈ నెల 28వ తేదీన సీఎం రేవంత్ బహిరంగ సభకు ప్లాన్ చేసిన కాంగ్రెస్.. ఈ సభను పోలీస్ గ్రౌండ్‌లో నిర్వహించనున్నట్లు తెలిపింది. ఆపై అక్టోబర్ 30, 31, నవంబర్ 4,5 తేదీలలో సీఎం రోడ్ షో చేపట్టనున్నట్లు కాంగ్రెస్ తెలిపింది. పలువురు సినీ ప్రముఖులు కాంగ్రెస్ ప్రచారంలో పాల్గొననున్నారు.

## గోమాత మత విశ్వాసం కాదు

**గోవును కాపాడితే ప్రకృతిని కాపాడినట్లే**

**కేంద్ర మండి బండి సంజయ్**

నారాయణగూడ/హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): గోసంతతిని కాపాడుకోవడం మత విశ్వాసం కాదని, గోవును కాపాడితే ప్రకృతిని కాపాడినట్లేనని, ప్రకృతిని కాపాడితే మన భవిష్యత్తును కాపాడినట్లేనని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఇస్లాంలోనూ కొందరు మత పెద్దలు గోవును పక్కన పెట్టుకుని నమాజ్ చేసిన దృశ్యాలను తాను చూశానని పేర్కొన్నారు. ఆదివారం నారాయణగూడ కేఎంఐటీ ఇంజనీరింగ్ కాలేజీలు, తెలంగాణ గో సేవా విభాగం ఆధ్వర్యంలో గోవు పర్యావరణ పరిరక్షణలో శాస్త్రీయ విజానం”పై రాష్ట్ర స్థాయి పరీక్షలు నిర్వహించారు. విజేతలకు కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నగరాలు, పట్టణాల్లోకే కాకుండా గ్రామాల్లోకి కూడా పాల ప్యాకెట్లు, పాల పౌడర్ డబ్బాలు, ప్యాకేజ్డ్ మిల్క్ ప్రొడక్ట్స్ అమ్మకాలు జరుగుతున్నాయన్నారు. నూటికి 90 శాతం మంది వాటిపైనే ఆధారపడి జీవించే పరిస్థితిలోకి వచ్చారని లేచిన దగ్గర నుంచి రాత్రి పడుకునే వరకు తినే తిండి, తాగే నీళ్ల వరకు అన్నీ కలుషితం అయినట్లు ఆవేదన వ్యక్తం చేశారు. సనాతన ధర్మం, మన జీవన విధానాన్ని మర్చిపోయి విదేశీ సంస్కృతి, జీవన విధానానికి అలవాటు పడటమే ప్రధాన కారణం. పరిస్థితి ఇదే విధంగా కొనసాగితే మన భవిష్యత్ తరాల మనుగడే ప్రమాదంలోకి వెళ్లే అవకాశముంది. భారతీయ మూలాలపై నేటి తరానికి అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. గోవు పేడ పొలాలకు ఎరువుగా పనిచేసి నేల సారాన్ని పెంచుతుందన్నారు. బయో గ్యాస్ తయారీకి ఉపయోగపడుతుంది. పిడకలు కాల్చినప్పుడు వాయు కాలుష్యం తగ్గుతుంది. పేడతో ఇళ్లు పూయడం వలన యాంటీ బ్యాక్టీరియల్ గుణాలు ఉంటాయి. గోమూత్రం అనేక వైరస్‌లను చంపే గుణాలు కలిగి ఉందన్నారు. ప్రభుత్వాలు గోమాత పేరుతో పథకాలు ప్రకటిస్తాయని అవి కాగితాలకే పరిమితమైందని, కొందరైతే గోమాత సంరక్షణను కేవలం మతపరమైన అంశంగా చూస్తున్నారు. గోవును కోల్పోతే ఏమవుతుందో కూడా ఆలోచించడం లేదు. గోవు లేకపోవడంతో రైతులు రసాయన ఎరువులకు బానిసలయ్యారు. భూమాతను, సమస్త ప్రకృతిని కాపాడే గోమాతను విస్మరించి రోడ్డు పాల్జేయడం అంతకంటే ఘోరం ఉండదన్నారు. గోవులను కాపాడేందుకు మోడీ ప్రభుత్వం రాష్ట్రీయ గోకుల్ మిషన్, నేషనల్ మిషన్ అన్ నాచురల్ ఫామింగ్, లైవ్ స్టాక్ హెల్త్ అండ్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ , నేషనల్ ప్రోగ్రామ్ ఫర్ డైరీ డెవలప్మెంట్, నేషనల్ అనిమల్ డిసీజ్ కంట్రోల్ ప్రోగ్రామ్ లాంటి పథకాలతో గోవుల సంతతి పెరిగేటట్లుగా చేస్తుందన్నారు. వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులపై సున్నా శాతం జీఎస్టీ విధించినట్లు పేర్కొన్నారు.

## స్లీపర్ బస్సులపై 32 కేసులు

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): ఏసీ స్లీపర్ బస్సుల అక్రమాల నేపథ్యంలో రవాణా శాఖ తనిఖీలు విస్తృతం చేసింది. తనిఖీలలో 32 కేసులు నమోదు చేశారు. రూ.లక్ష కంపౌండ్ ఫీజ్ విధించారు. రంగా రెడ్డి, మేడ్చల్ జిల్లాల్లో ఆర్టీఏ, డీటీసీ బృందాలు ఆదివారం బస్సులను తనిఖీలు చేపట్టాయి. డీటీసీ రంగా రెడ్డి జిల్లా పరిధిలో 7 కేసులు నమోదు చేసి రూ.35,000 కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. వాహనాల్లో ఫైర్ ఎక్స్టింగ్విషర్లు లేకపోవడం ప్రధాన ఉల్లంఘనగా గుర్తించినట్లు వెల్లడించారు. ఆర్టీఏ సౌత్ జోన్ పరిధిలో 11 కేసులు నమోదు చేసి రూ.31,000 కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు. యూనిఫారం లేకుండా డ్రైవింగ్ చేయడం, అగ్ని మాపక పరికరాలు లేని ఉల్లంఘనలు గుర్తించినట్లు తెలిపారు. ఆర్టీఏ ఈస్ట్ జోన్ పరిధిలో 3 కేసులు నమోదు చేసి రూ.3,000 వసూలు చేశారు. పలుచోట్ల చెపట్టిన తనిఖీల్లో 11 కేసులు నమోదు చేసి రూ.31,000 కాంపౌండింగ్ ఫీజు వసూలు చేశారు.

## కాంగ్రెస్‌కు భారీ మెజార్టీ ఖాయం

**టీపీసీసీ చీఫ్ మహేశ్‌కుమార్ గౌడ్**

న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో గెలుస్తుందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో 46వేల మంది చిన్నారులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయని చెప్పారు. మంత్రుల పంచాయితీ ముగిసిన అధ్యాయమని పేర్కొన్నారు. దిల్లీ పర్యటనలో ఉన్న మహేశ్‌కుమార్ గౌడ్ మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలోని పరిస్థితులను పార్టీ హైకమాండ్ గమనిస్తోందన్నారు. కొందరు ఎమ్మెల్యేలకు డీసీసీ అధ్యక్ష బాధ్యతలు అప్పగించే అవకాశం ఉందని మహేశ్‌కుమార్‌గౌడ్ అభిప్రాయపడ్డారు. తొలి నుంచి పార్టీకి సేవచేసిన కుటుంబాలకు అవకాశాలు వస్తాయన్నారు. రాష్ట్రానికి కేంద్రం నుంచి సరైన సహకారం లేదని ఆయన ఆరోపించారు. రాజకీయాలు ఎన్నికల వరకే ఉండాలని, ఆ తర్వాత అందరూ కలిసి రాష్ట్రాభివృద్ధి కోసం పాటుపడాలని అన్నారు. హైదరాబాద్ మెట్రో ఫేజ్-2 పనులకు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అడ్డంకులు పెడుతున్నారని ఆరోపించారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో 10 ఏళ్లు భారత రాష్ట్రసమితి అభ్యర్థులే గెలిచారని, మరి ఓట్ చోరీ ఎవరు చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ అంశంపై తొలుత ఫిర్యాదు చేసింది సీఎం రేవంత్‌రెడ్డే అని గుర్తు చేశారు. అధికారులు, మంత్రులు ఎవరైనా జవాబుదారీగా ఉండాలని సూచించారు.

## జనవరి 3 నుంచి తెలుగు మహాసభలు

**జస్టిస్ ఎన్వీ రమణకు ఆహ్వానం**

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు) : ఆంధ్ర సారస్వత పరిషత్ - ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో మూడో ప్రపంచ తెలుగు మహాసభలను వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు కొనసాగుతున్నాయి. ఈ మహాసభలకు ముఖ్య అతిథిగా విచ్చేయాలని కోరుతూ భారత సుప్రీంకోర్టు పూర్వ ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎన్వీ రమణకు ఆహ్వానం అందజేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లో ఆయన్ను డా. గజల్ శ్రీనివాస్, మా శర్మ కలిసి ఆహ్వాన పత్రికను అందజేశారు. వచ్చే ఏడాది జనవరి 3 నుంచి 5వ తేదీ వరకు గుంటూరులోని అమరావతి శ్రీ సత్యసాయి స్పిరిచ్యువల్ సిటీ ప్రాంగణం (హైవే)లో నందమూరి తారకరామారావు వేదికపై ప్రపంచ మూడో తెలుగు మహాసభలను నిర్వహించనున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా జనవరి 4వ తేదీన ఉదయం నిర్వహించే ‘తెలుగు వైభవ సభ’కు జస్టిస్ ఎన్వీ రమణను ముఖ్య అతిథిగా ఆహ్వానించగా.. తమ ఆహ్వానానికి ఆయన ఎంతో సానుకూలంగా స్పందించారని ఆంధ్ర సారస్వత పరిషత్ అధ్యక్షుడు డాక్టర్ గజల్ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు.

## బీహెచ్ఈఎల్‌లో అక్రమాలు!

పెద్దపల్లి, అక్టోబర్ 26 (ఈవార్తలు): బీహెచ్ఈఎల్ అధికారులపై నమోదైన ఎఫ్ఐఆర్‌పై సీబీఐ హైదరాబాద్ జోనల్ కార్యాలయ అధికారులు దర్యాప్తు చేపట్టారు. పెద్దపల్లి ఎన్టీపీసీ రామగుండం సైట్ బీహెచ్ఈఎల్ సంస్థలో బిల్లుల జారీ, మంజూరు విషయంలో జరిగిన అక్రమాలపై దర్యాప్తు ముమ్మరం చేశారు. బీహెచ్ఎల్ కంపెనీలో రూ.35.03 కోట్ల మేర అవకతవకలకు పాల్పడ్డట్టు నమోదైన ఫిర్యాదుపై విచారణ చేపట్టారు. బీహెచ్ఈఎల్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ కొడపె సునీల్ కుమార్ సహా మొత్తం 9 మందిపై విజిలెన్స్ అడిషనల్ జీఎం హరీష్ కుమార్ గుప్తా మార్చిలో ఫిర్యాదు చేయగా అక్టోబర్ 14వ తేదీన ఎఫ్ఐఆర్ రిజిస్టర్ అయింది. బాయిలర్ కాంట్రాక్టుల్లో ఎరక్షన్, కమిషనింగ్ పనులను కలకత్తాకు చెందిన బ్రిడ్జ్ అండ్ రూఫ్ కంపెనీ ఇండియా లిమిటెడ్, కాంట్రాక్టర్ సంస్థ పవర్ ఇన్ఫ్రామెచ్ ప్రైవేట్ లిమిటెడ్ చేపట్టాయి. బ్రిడ్జ్ అండ్ రూఫ్ ఇండియా కంపెనీ లిమిటెడ్ వేతన బిల్లులను బీహెచ్ఎల్‌కు సమర్పించిన అక్రమాలకు పాల్పడింది. 2021%-%22 సంవత్సరాల్లో ఫోర్జరీ, నకిలీ బిల్లులతో రూ.35.03 కోట్ల అదనపు చెల్లింపులు జరిపారు.

## కవితను ఎందుకు గెంటేశారు?

**బీఆర్ఎస్‌కు అద్దంకి సూటి ప్రశ్న**

హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): లక్షల కోట్ల తెలంగాణ ధనాన్ని ముంచిన బీఆర్ఎస్ నాయకులు కూడా మాట్లాడుతున్నారని బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్‌రావుపై కాంగ్రెస్ ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్‌మండిపడ్డారు. తమ శాఖలోనే ఎంత అవినీతి ఉందో ప్రజలకు తెలుసు అని, భూముల్ని ప్రజల ఆస్తుల్ని కొల్లగొట్టింది మీరేనని ఆయన ఆరోపించారు. ఆదివారం అద్దంకి దయాకర్‌మీడియాతో మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో తమరు ఎన్ని ఇల్లు కట్టారు?.. తమ మంత్రులు మాట్లాడే హక్కు తమకు ఎక్కడిదని ప్రశ్నించారు. తమ అవినీతిని రాష్ట్ర ప్రజలు మర్చిపోరని, లేనిపోని ఆరోపణ చేస్తే ప్రజలు మిమ్మల్ని పట్టించుకోరన్నారు. తమ డబ్బా తమరే కొట్టుకోవడం తప్ప... ఎవరైనా మాట్లాడుతున్నారా అని అద్దంకి దయాకర్ ప్రశ్నించారు. కేసీఆర్ బయటకి వచ్చి తన కూతురిని ఎందుకు పంపించారో ఒక స్టేట్మెంట్ ఇవ్వమనండి అని ఆయన సవాల్ విసిరారు. కిందపడినా కూడాపై చేయి మాదే అనుకొని బీఆర్ఎస్ నేతలు భ్రమ పడుతున్నారని అద్దంకి దయాకర్ విమర్శించారు.

# ఆర్టీసీకి గిరాకీ

**కర్నూలు ఘటన ఎఫెక్ట్**






హైదరాబాద్, అక్టోబర్ 26 (ఈవార్తలు): కర్నూలు జిల్లా చిన్నటేకూరు వద్ద జరిగిన ఘోర బస్సు ప్రమాదం సంగతి తెలిసిందే. హైదరాబాద్ నుంచి బెంగుళూరు వెళ్తున్న ఓ ప్రయివేట్ ట్రావెల్ బస్సు, ఎదురుగా వస్తున్న బైక్ ను ఢీకొనడం వల్ల, నిప్పులు చెలరేగి ఆయిల్ ట్యాంకుకు అంటుకొని, క్షణాల్లో బస్సు మంటల్లో చిక్కుకొని, అందులోని ప్రయాణికుల్లో 19 మంది సజీవదహనం అయ్యారు. ఈ ఘోర దుర్ఘటన అనంతరం ప్రయివేట్ ట్రావెల్ బస్సుల్లో ప్రయాణించేందుకు ప్రయాణికులు భయపడుతున్నారు. ప్రమాదం జరిగిననాటి నుంచి వందలమంది ఆర్టీసీ బస్సుల వైపు మొగ్గుచూపుతున్నారు. ఫలితంగా ఆన్లైన్ రిజర్వేషన్లలో ప్రయివేట్ ట్రావెల్ బస్సుల సీట్లన్నీ ఖాళీగా కనిపిస్తున్నాయి. మరోవైపు హైదరాబాద్ నుంచి వివిధ నగరాలకు వెళ్లే 200కు పైగా ఆర్టీసీ బస్సులు ప్రయాణికులతో కిటకిటలాడటమే కాదు, ముందస్తు బుకింగ్స్ అన్నీ నిండిపోయి, అదనపు బస్ సర్వీసులు వేయాల్సి వస్తోందని అధికారులు అంటున్నారు. మరోవైపు ఆర్టీఏ అధికారులు ప్రయివేట్ ట్రావెల్ బస్సులపై కొరడా ఝులిపింస్తోంది. ట్రావెల్ బస్సులు రోడ్డు ఎక్కకముందే అస్సాధికారులు తనిఖీలు చేస్తుండటంతో.. ట్రావెల్ బస్సులు బయటికి తీయడం లేదు. దీంతో గత రెండు రోజులుగా వందలాది ప్రయివేట్ బస్సులు కదలలేదు.

# మద్యం మత్తులోనే బైకర్

## 'కర్నూలు' ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడి





కర్నూలు, అక్టోబర్ 26 (ఈవార్తలు): కర్నూలు సమీపంలో 19 మందిని బలిగొన్న బస్సు అగ్నిప్రమాద ఘటనలో కీలక విషయం వెలుగులోకి వచ్చింది. ప్రమాదానికి కారణమైన బైక్ నడిపిన యువకుడు మద్యం మత్తులో ఉన్నట్లు ఫోరెన్సిక్ నివేదికలో వెల్లడైంది. అయితే, బస్సు డ్రైవర్ మద్యం సేవించలేదని పోలీసులు స్పష్టం చేశారు. ఈ దారుణ ఘటనకు బైకర్ నిర్లక్ష్యమే ప్రధాన కారణమని ఫోరెన్సిక్ నివేదికతో పాటు, అతనితో ప్రయాణిస్తున్న స్నేహితుడి వాంగ్మూలం కూడా బలపరుస్తోంది. కర్నూలు రీజినల్ ఫోరెన్సిక్ సైన్స్ లేబొరేటరీ నుంచి వచ్చిన నివేదిక ఈ విషయాన్ని ధృవీకరించింది. బైక్ నడుపుతూ డివైడర్‌ను ఢీకొని మరణించిన బి. శివశంకర్ (22) మద్యం సేవించి ఉన్నాడని ఫోరెన్సిక్ రిపోర్టులో తేలిందని కర్నూలు జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదివారం మీడియాకు తెలిపారు. శివశంకర్‌తో పాటు బైక్‌పై ఉన్న అతని స్నేహితుడు ఎర్రిస్వామి కూడా తాము ఇద్దరం మద్యం సేవించామని పోలీసుల ఎదుట అంగీకరించాడు. ప్రమాదం తర్వాత బస్సులో మంటలు చెలరేగడంతో భయంతో అక్కడి నుంచి పారిపోయినట్లు ఎర్రిస్వామి చెప్పాడు. అంతకుముందు శివశంకర్ మృతదేహాన్ని రోడ్డు పక్కకు లాగి, రోడ్డు మధ్యలో పడి ఉన్న బైక్‌ను తీసేలోపే వేగంగా వచ్చిన బస్సు దాన్ని ఢీకొట్టిందని వివరించాడు. చిన్నటేకూరు వద్ద రోడ్డుపై పడి ఉన్న పల్సర్ బైక్‌ను ఢీకొట్టిన బస్సు, దానిని సుమారు 200 మీటర్ల దూరం లాక్కెళ్లింది. ఈ క్రమంలో బైక్ నుంచి పెట్రోల్ లీక్ అవ్వడం, ఘర్షణ కారణంగా నిప్పురవ్వలు చెలరేగడంతో క్షణాల్లో డబుల్ డెక్కర్ బస్సు మొత్తం మంటల్లో చిక్కుకుంది. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ఈ ప్రైవేట్ బస్సులో ఇద్దరు డ్రైవర్లతో సహా 46 మంది ప్రయాణిస్తున్నారు. ఈ ఘోర దుర్ఘటనలో ఇద్దరు చిన్నారులతో సహా 19 మంది సజీవదహనం కాగా, ఇద్దరు డ్రైవర్లు సహా 27 మంది అద్దాలు పగలగొట్టుకుని ప్రాణాలు కాపాడుకున్నారు. ఈ ఘటనపై ప్రయాణికుడి ఫిర్యాదు మేరకు పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బస్సు డ్రైవర్ మిరియాల లక్ష్మయ్య, వి. కావేరి ట్రావెల్స్ యజమాని వేమూరి వినోద్ కుమార్ పై నిర్లక్ష్యంగా వ్యవహరించి మరణాలకు కారణమయ్యారన్న ఆరోపణలతో బీఎన్ఎస్ సెక్షన్ 106(1), 125(ఎ) కింద కేసులు పెట్టారు. మరోవైపు, ఎర్రిస్వామి ఫిర్యాదు మేరకు మద్యం తాగి నిర్లక్ష్యంగా బైక్ నడిపినందుకు మృతుడు శివశంకర్‌పైనా ఉలిందకొండ పోలీస్ స్టేషన్‌లో మరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. ఇదే సమయంలో బస్సు డ్రైవర్ లైసెన్స్‌పైనా పోలీసులు ఆరా తీస్తున్నారు. కేవలం 5వ తరగతి చదివిన లక్ష్మయ్య, నకిలీ 10వ తరగతి సర్టిఫికెట్‌తో హెవీ వెహికల్ లైసెన్స్ పొందినట్లు ఆరోపణలు వస్తున్నాయి. రవాణా వాహనం నడపాలంటే కనీసం 8వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలనే నిబంధన ఉంది. అలాగే, బస్సును నిబంధనలకు విరుద్ధంగా స్లీపర్ కోచ్‌గా మార్చడం, డామన్ డయ్యూలో రిజిస్టర్ అయి ఉన్న బస్సును ఈ ఏడాదే ఒడిశాలో రీ-రిజిస్టర్ చేయడం వంటి అంశాలపై కూడా రవాణా శాఖ అధికారులు విచారణ జరుపుతున్నారు.

### 19 మృతదేహాలు కుటుంబ సభ్యులకు అప్పగింత



కర్నూలు సమీపంలో జరిగిన ఘోర బస్సు అగ్నిప్రమాదంలో మృతి చెందిన 19 మంది మృతదేహాలను డీఎన్ఏ పరీక్షల అనంతరం వారి కుటుంబ సభ్యులకు అప్పగించారు. గత రెండు రోజులుగా కర్నూలు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో నిర్వహించిన డీఎన్ఏ పరీక్షల ప్రక్రియ ఆదివారం పూర్తి కావడంతో అధికారులు మృతదేహాలను కుటుంబాలకు అందజేశారు. కర్నూలు జిల్లా కలెక్టర్ ఎ. సిరి ఈ ప్రక్రియను స్వయంగా పర్యవేక్షించారు. మృతుల కుటుంబాలకు మరణ ధృవీకరణ పత్రాలు కూడా జారీ చేశారు. మృతదేహాలను వారి స్వస్థలాలకు తరలించేందుకు అధికారులు ప్రత్యేక అంబులెన్సులను ఏర్పాటు చేశారు. మృతులలో ఏడుగురు ఆంధ్రప్రదేశ్, ఆరుగురు తెలంగాణకు చెందిన వారు కాగా.. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాలకు చెందిన చెరో ఇద్దరు, ఒడిశా, బీహార్‌కు చెందిన ఒక్కొక్కరు ఉన్నారు.

### బైకర్‌పై స్నేహితుడు ఎర్రిస్వామి ఫిర్యాదు

19 మంది సజీవ దహనానికి కారణమైన ఈ దుర్ఘటనకు, ప్రమాదంలో మృతి చెందిన బైకర్ శివశంకర్ నిర్లక్ష్యమే కారణమని అతని స్నేహితుడు ఎర్రిస్వామి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ ఫిర్యాదు ఆధారంగా ఉలిందకొండ పోలీసులు మృతుడు శివశంకర్‌పై వివిధ బీఎన్ఎస్ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఎర్రిస్వామి తన ఫిర్యాదులో ప్రమాదానికి దారితీసిన పరిస్థితులను పూసగుచ్చినట్లు వివరించాడు. "గురువారం రాత్రి నేనూ, శివశంకర్ బైక్‌పై వెళుతున్నాం. బైక్‌ను శివశంకర్ నడుపుతున్నాడు. అతని నిర్లక్ష్యం కారణంగా బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. దీంతో మేమిద్దరం కిందపడిపోయాం. ఈ ఘటనలో శివశంకర్ అక్కడికక్కడే మరణించాడు. నేను అతని మృతదేహాన్ని పక్కకు తీసే ప్రయత్నం చేస్తుండగా, మరో వాహనం మా బైక్‌ను ఢీకొని రోడ్డు మధ్యలోకి లాక్కెళ్లింది. అదే సమయంలో వేగంగా వచ్చిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు ఆ బైక్‌ను ఈడ్చుకెళ్లింది. దీనివల్లే బస్సులో మంటలు చెలరేగాయి" అని ఎర్రిస్వామి పేర్కొన్నాడు.



## గంజాయితో పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులు

పెగడపల్లి, అక్టోబర్ 26 (ఈవార్తలు): అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు పెగడపల్లి ఎస్సై కిరణ్ కుమార్ తెలిపారు. ఆదివారం సాయంత్రం మండలంలోని వెంగలాయిపేట గ్రామంలో వాహనాల తనిఖీ చేస్తుండగా అనుమానాస్పదంగా ఉన్న ఇద్దరు వ్యక్తులు కనిపించారు. వారిని తనిఖీ చేయగా గంజాయి దొరికిందని, దీంతో వారిని అరెస్టు చేసి నమోదు చేశామని ఎస్సై తెలిపారు. ఎవరైనా గంజాయి వినియోగించినా, సరఫరా చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు.



## అక్బర్ హుస్సేన్ గెలుపు

**మెకానిక్ అసోసియేషన్ జగిత్యాల అధ్యక్షుడిగా ఎన్నిక**

జగిత్యాల టౌన్, అక్టోబర్ 26 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా ఆటో మొబైల్ మెకానిక్ వర్క్ షాప్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడిగా అక్బర్ హుస్సేన్ గెలుపొందారు. అసోసియేషన్ ఎన్నికలు ఆదివారం జరిగాయి. ఈ సందర్భంగా తన సమీప ప్రత్యర్థి సంపత్ రెడ్డిపై 11 ఓట్ల మెజార్టీతో అక్బర్ హుస్సేన్ విజయం సాధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆటోనగర్ సాధనకు సభ్యులందరి సహకారంతో ముందుకెళ్తానని, ప్రతి యూనియన్ సభ్యుడికి రూ.1 లక్ష ప్రమాదబీమా కల్పిస్తానని, యూనియన్ సభ్యులకు రుణాలు వచ్చేలా చూస్తానని, ప్రతి మూడు నెలలకు ఒకసారి హెల్త్ క్యాంపు నిర్వహిస్తామని తెలిపారు. యూనియన్ అభివృద్ధికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. అనంతరం యూనియన్ సభ్యులు అక్బర్‌ను శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు.



## 30 నుంచి శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం

తిరుమల, అక్టోబర్ 26 (ఈవార్తలు) : టీటీడీ ఆధ్వర్యంలో అక్టోబర్ 30 నుంచి నవంబర్ 1వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో శ్రీవారి త్రైమాసిక మెట్లోత్సవం ఘనంగా నిర్వహించనున్నారు. ప్రతి రోజు మధ్యాహ్నం 1 నుంచి సాయంత్రం 4 గంటల వరకు భజన మండళ్లతో నామ సంకీర్తన, సామూహిక భజన, ధార్మిక సందేశాలు, మహనీయులు మానవాళికి అందించిన ఉపదేశాలను వెల్లడిస్తారని ఆలయ అధికారులు వివరించారు. సాయంత్రం 6 నుంచి రాత్రి 8 గంటల వరకు సంగీత విభావరి, సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని వెల్లడించారు. నవంబర్ 1న ఉదయం 8.30 గంటలకు సామూహిక నామ సంకీర్తన, ఉదయం 9.30 గంటల నుంచి స్వామిజీలు భక్త కోటికి ధార్మిక సందేశం ఇవ్వనున్నారని పేర్కొన్నారు. అక్టోబర్ 31న ఉదయం 4.30 గంటలకు అలిపిరి పాదాల మండపం వద్ద మెట్లపూజ నిర్వహిణ అనంతరం వేల సంఖ్యలో వచ్చే భజన మండలి సభ్యులతో సాంప్రదాయ భజనలు చేస్తూ సప్తగిరీశుని చేరుకుంటారని తెలిపారు. మహర్షులు, రాజర్షులు , పురందరదాసులు, వ్యాసరాజయతీశ్వరులు, శ్రీమాన్ అన్నమాచార్యులు, శ్రీకృష్ణదేవరాయలు లాంటి మహనీయులు భక్తిప్రపత్తు అడుగుజాడలలో నడిచి ఆ దేవదేవుని కృపకు అందరూ పాత్రులు కావాలనే ఉన్నతాశయంతో మెట్లోత్సవ కార్యక్రమాన్ని దాస సాహిత్య ప్రాజెక్టు చేపట్టిందన్నారు.

## నిండుకుండలా తిరుమల జలాశయాలు

**పూజలు చేసి హారతి ఇచ్చిన టీటీడీ చైర్మన్**

తిరుమల, అక్టోబర్ 26 (ఈవార్తలు): ఈశాన్య రుతుపవనాలు, బంగాళాఖాతంలో ఏర్పడిన తీవ్ర అల్పపీడనం కారణంగా తిరుపతిలో గడిచిన మూడు రోజులు భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిశాయి. దీంతో తిరుమల కొండలపై ఉన్న పాపవినాశనం జలాశయం పూర్తి స్థాయిలో నిండుకుంది. దీంతో ఈ రోజు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఇతర అధికారులతో కలిసి పాపవినాశనం జలాశయం వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలో పసుపు%-%కుంకుమ, పూలు, పండ్లు గంగకు నివేదించి ప్రత్యేక పూజలు చేశారు. తీర్థక్షేత్రం తిరుమలలోని నాలుగు జలాశయాలు పూర్తిగా నిండాయని, ఇంకా రెండు జలాశయాలు కొంత మేర నిండాల్సి ఉందని అధికారులు తెలిపారు. భక్తుల అవసరాల కోసం రోజుకు 50 లక్షల గ్యాలన్ల నీటి అవసరం ఉండగా, అందులో 25 లక్షల గ్యాలన్లు కళ్యాణి జలాశయం నుండి వస్తుందని, ప్రస్తుతం తిరుమలలో 250 రోజుల నీటి అవసరాలకు సరిపడా వాటర్ స్టోరేజ్ వచ్చిందని, ఇది ఒక శుభపరిణామమని. అలాగే జలాశయాలను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ నీటి నిర్వహణను సమర్థంగా కొనసాగిస్తున్న ఇంజనీరింగ్ శాఖను అభినందిస్తున్నట్లు టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. అలాగే టీటీడీ చరిత్రలో తొలిసారిగా భారీ విరాళాలు వచ్చాయని, గత 11 నెలల్లోనే రూ.918 కోట్లు విరాళాలు టీటీడీ ట్రస్టులకు అందడం చారిత్రాత్మకమని ఈ సందర్భంగా బీఆర్ నాయుడు గుర్తు చేశారు.

## అఫ్ఘన్‌తో యుద్ధం చేస్తాం

**ఇస్తాంబుల్‌లో పాక్-ఆఫ్ఘన్ శాంతి చర్చలు.. విఫలమైతే యుద్ధమేనన్న పాక్ మంత్రి**

ఇస్తాంబుల్: పాకిస్థాన్, ఆఫ్ఘనిస్తాన్ మధ్య సంబంధాలు అత్యంత ఉద్రిక్తంగా మారిన నేపథ్యంలో, ఇరు దేశాల మధ్య రెండో విడత శాంతి చర్చలు శనివారం ఇస్తాంబుల్‌లో ప్రారంభమయ్యాయి. అయితే, ఓవైపు శాంతి చర్చలు జరుగుతుండగానే... మరోవైపు పాకిస్థాన్ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ తీవ్ర వ్యాఖ్యలు చేయడం ప్రాధాన్యం సంతరించుకుంది. చర్చలు విఫలమైతే ఆఫ్ఘనిస్థాన్‌తో బహిరంగ యుద్ధానికి దిగాల్సి వస్తుందని ఆయన హెచ్చరించారు. టర్కీ, ఖతార్ దేశాల సంయుక్త మధ్యవర్తిత్వంతో ఈ చర్చలు జరుగుతున్నాయి. అక్టోబర్ 18-19 తేదీల్లో దోహాలో తొలి విడత చర్చలు జరిగాయి. తాజా చర్చల్లో ఆఫ్ఘనిస్థాన్ తరఫున ఉప అంతర్గత వ్యవహారాల మంత్రి రహమతుల్లా ముజీబ్, అనస్ హక్కానీ పాల్గొంటుండగా, పాకిస్థాన్ నుంచి ఇద్దరు భద్రతాధికారులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఈ చర్చల ఫలితం ఆదివారం వెలువడే అవకాశం ఉందని పాక్ రక్షణ మంత్రి సియాల్‌కోట్‌లో తెలిపారు. పాకిస్థాన్‌కు చెందిన 'డైలీ టైమ్స్' కథనం ప్రకారం, చర్చలు విఫలమైతే ఆఫ్ఘనిస్థాన్‌తో బహిరంగ యుద్ధం తప్పదని, అయితే రెండు పక్షాలు శాంతినే కోరుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు. తమ దేశంపై దాడులకు పాల్పడుతున్న తెహ్రీక్-ఇ-తాలిబన్ పాకిస్తాన్ (టీటీపీ) ఉగ్రవాద సంస్థను తమ భూభాగం నుంచి పూర్తిగా ఏరివేయాలని ఆఫ్ఘనిస్థాన్‌కు పాకిస్థాన్ గట్టిగా తేల్చిచెబుతోంది. ఈ విషయంలో ఆఫ్ఘన్ నుంచి కచ్చితమైన, ధ్రువీకరించదగిన హామీని పాక్ కోరుతున్నట్లు అక్కడి 'డాన్' పత్రిక పేర్కొంది. అలాగే, చర్చల పురోగతిని పర్యవేక్షించేందుకు టర్కీ, ఖతార్‌లతో కూడిన తృతీయ పక్ష పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని కూడా ఇస్లామాబాద్ ప్రతిపాదిస్తోంది.

## ఇంటి భోజనంతో మహిళలకు ఉపాధి


**అమరావతిలో సీఆర్డీఏ కొత్త పథకం**



అమరావతి, అక్టోబర్ 26 (ఈవార్తలు) : అమరావతి గ్రామాల్లోని మహిళలకు ఆర్థిక స్వావలంబన కల్పించే దిశగా అమరావతి రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ (సీఆర్డీఏ) ఒక వినూత్న కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 'క్లౌడ్ కిచెన్' పేరుతో సరికొత్త పథకాన్ని అమలు చేస్తూ, మహిళలు తమ ఇళ్ల నుంచే ఉపాధి పొందేందుకు మార్గం సుగమం చేస్తోంది. ఈ పథకం ద్వారా అమరావతి నిర్మాణ పనుల్లో పాల్గొంటున్న కార్మికులు, అధికారులు, ఉద్యోగులకు నాణ్యమైన ఇంటి భోజనాన్ని కేవలం రూ.99కే అందిస్తున్నారు. ఈ పథకం కింద, రాజధానిలోని ప్రతి గ్రామం నుంచి సుమారు 35 మంది మహిళలను ఎంపిక చేసి వారికి ప్రత్యేక శిక్షణ ఇస్తున్నారు. ఒక్కో బ్యాచ్‌కు 26 రోజుల పాటు వంటల తయారీలో మెళకువలు, పరిశుభ్రత, నాణ్యతా ప్రమాణాలు, వ్యాపార నిర్వహణ వంటి అంశాలపై నిపుణులతో తర్ఫీదు ఇప్పిస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారు భోజనం తయారీ ప్రారంభించేలా ప్రోత్సహిస్తున్నారు. ఇటీవల లింగాయపాలెం గ్రామానికి చెందిన ఆరుగురు మహిళల బృందం శిక్షణ పూర్తి చేసుకుని, తమ క్లౌడ్ కిచెన్‌ను ప్రారంభించింది. వీరు నూతనంగా ప్రారంభమైన సీఆర్డీఏ కార్యాలయంలోని ఉద్యోగులకు భోజనం సరఫరా చేస్తున్నారు. ప్రస్తుతం రోజుకు 100కి పైగా ఆర్డర్లు వస్తున్నాయని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా మహిళలను లక్షాధికారులను చేయడమే తమ లక్ష్యమని సీఆర్డీఏ జూనియర్ లైవ్లీహుడ్ స్పెషలిస్ట్ నరసింహం పేర్కొన్నారు. ఈ పథకంపై మహిళల నుంచి మంచి స్పందన వస్తోంది. "ఇంటి వద్దే ఉంటూ ఆదాయం పొందేందుకు క్లౌడ్ కిచెన్ ఎంతగానో ఉపయోగపడుతుంది. సీఆర్డీఏ శిక్షణ ఇచ్చి ప్రోత్సహించడం ద్వారా మాకు ఆర్థిక భరోసా లభిస్తుంది" అని హర్షం వ్యక్తం చేస్తున్నారు.

## కేశినేని చిన్ని పతనం ప్రారంభం: పేర్ని నాని

విజయవాడ, అక్టోబర్ 26 (ఈవార్తలు) విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని పతనం ప్రారంభమైందని, గొడుగుపేట వెంకటేశ్వర స్వామి ఆలయ భూములు కాజేయాలని ప్రయత్నించారని వైసీపీ నేత, మాజీ మంత్రి పేర్ని నాని తెలిపారు. అప్పటి నుంచి చిన్నికి ఎదురుదెబ్బలు తగులుతున్నాయని ఆయన చెప్పారు. పేర్ని నానితో తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు టచ్‌లో ఉన్నారనే ఆరోపణలపై ఆయన స్పందించారు. కొలికపూడి శ్రీనివాసరావును తానెప్పుడూ కలవలేదన్నారు. ప్రస్తుతం చిన్నికి ఆర్థిక ఇబ్బందులు ఉన్నాయని పేర్ని నాని వ్యాఖ్యానించారు.



# ఏపీలోని పలు జిల్లాల్లో విద్యాసంస్థలకు సెలవు

**బంగాళాఖాతంలో 'మొంథా' తుఫాను**

**కాకినాడ జిల్లాలో అత్యధికంగా 5 రోజుల సెలవులు**

**తీవ్ర తుపానుగా మారే అవకాశం ఉందని హెచ్చరిక**

**అధికార యంత్రాంగాన్ని అప్రమత్తం చేసిన ప్రభుత్వం**

**అక్టోబర్ 28న తీరం దాటే అవకాశం**

కాకినాడ, అక్టోబర్ 26 (ఈవార్తలు): 'మొంథా' తుపాను ప్రభావం ఆంధ్రప్రదేశ్ పై అత్యధికంగా ఉంటుందని వాతావరణ సంస్థలు హెచ్చరిస్తున్నాయి. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు, బలమైన గాలులు వీచే అవకాశం ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. ముందు జాగ్రత్త చర్యగా, విద్యార్థుల భద్రతను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం పలు జిల్లాల్లోని పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. తుఫాను తీవ్రత దృష్ట్యా ప్రభుత్వం వివిధ జిల్లాల్లో పాఠశాలలకు సెలవులు ప్రకటించింది. ఆయా జిల్లాల్లో వర్షపాతాన్ని బట్టి సెలవుల సంఖ్యను నిర్ణయించారు.

**5 రోజులు: కాకినాడ జిల్లాలో అత్యధికంగా ఐదు రోజుల పాటు (అక్టోబర్ 27 నుంచి 31 వరకు) సెలవులు ఇచ్చారు.**

**3 రోజులు: కృష్ణా, బాపట్ల, గుంటూరు, అనకాపల్లి జిల్లాల్లో మూడు రోజులు (అక్టోబర్ 27, 28, 29) సెలవులు ప్రకటించారు.**

**2 రోజులు: తూర్పు గోదావరి, అన్నమయ్య, కడప, ఏలూరు, అంబేద్కర్ కోనసీమ జిల్లాల్లో రెండు రోజుల పాటు (అక్టోబర్ 27, 28) పాఠశాలలకు సెలవులు వర్తిస్తాయి.**

**1 రోజు: పల్నాడు జిల్లాలో అక్టోబర్ 27న ఒక రోజు సెలవు ప్రకటించారు.**



**ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తం**

ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ఆదేశాల మేరకు అధికార యంత్రాంగం సహాయక చర్యలకు సిద్ధమైంది. ప్రభావిత ప్రాంతాల్లో ఎన్‌డీఆర్ఎఫ్ బృందాలను మోహరించారు. పునరావాస కేంద్రాలు, విద్యుత్ బ్యాకప్, వైద్య సదుపాయాలను సిద్ధం చేశారు. ముఖ్యమంత్రి కార్యాలయంలో 24/7 కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అనవసరంగా బయటకు రావొద్దని అధికారులు సూచిస్తున్నారు.

**రంగంలోకి భారత సైన్యం**

మొంథా తుఫాను ఎఫెక్ట్‌తో భారత సైన్యం అప్రమత్తమైంది. తీరప్రాంత రాష్ట్రాల్లో సహాయక చర్యల కోసం తమ బృందాలను సిద్ధం చేసింది. తుపాను హెచ్చరికల నేపథ్యంలో భారత సైన్యం జాతీయ విపత్తు నిర్వహణ అథారిటీ, భారత వాతావరణ శాఖ, తీరప్రాంత రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సమన్వయం చేసుకుంటోంది. ఇప్పటికే ప్రభావితమయ్యే అవకాశం ఉన్న రాష్ట్రాలకు విపత్తు సహాయక బృందాలను తరలించింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలకు 10 యాక్టివ్, 7 రిజర్వ్ బృందాలను కేటాయించింది. కర్ణాటక, కేరళ, తమిళనాడు, పశ్చిమ బెంగాల్, లక్షద్వీప్ దీవులకు కూడా ఆర్మీ బృందాలు చేరుకున్నాయి. ఆర్మీ కంట్రోల్ రూమ్‌ల ద్వారా 24 గంటలూ పరిస్థితిని సమీక్షిస్తున్నామని, 'మొంథా' తుపాను వల్ల ఎలాంటి విపత్కర పరిస్థితులు తలెత్తినా ప్రజలకు అవసరమైన మానవతా సహాయం, సహాయక చర్యలు అందించడానికి పూర్తి సన్నద్ధతతో ఉన్నామని ఆర్మీ అధికారి ఒకరు ఆదివారం స్పష్టం చేశారు.



దేశవ్యాప్తంగా అమలుకు ఈసీ నిర్ణయం


# సర్.. ఆలిండియా

## నేటి సాయంత్రం మీడియా సమావేశం.. సర్ తేదీలను ప్రకటించే అవకాశం

న్యూఢిల్లీ: దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) తేదీలను ప్రకటించడానికి సోమవారం సాయంత్రం భారత ఎన్నికల సంఘం విలేకరుల సమావేశం నిర్వహించనున్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఈ సమావేశం సోమవారం సాయంత్రం 4:15 గంటలకు జరుగుతుందని వెల్లడించారు. సమావేశంలో ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్, ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సంధు, వివేక్ జోషిలు పాల్గొని వివరాలను వెల్లడిస్తారని తెలిపారు.సర్ మొదటి దశ 10 నుంచి 15 రాష్ట్రాలను కవర్ చేయనున్నట్లు సమాచారం. వీటిలో 2026 లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలు కూడా ఉన్నాయి. కొత్త ఓటర్లను నమోదు చేయడం, మరణించిన వారి పేర్లను, నకిలీ ఎంట్రీలను తొలగించడం, బదిలీలు వంటి ఓటర్ల జాబితాను నవీకరించడం కోసం సర్ ఒక కీలకమైన




ప్రక్రియగా ఉపయోగపడుతుందని అధికారులు చెబుతున్నారు. ఎన్నికల కమిషన్ ముఖ్యంగా సర్ అమలును త్వరలో ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, అస్సాం, పుదుచ్చేరి వంటి రాష్ట్రాలపై దృష్టి సారించింది. ఈ రాష్ట్రాలలో 2026 లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. మొదటి దశకు సంబంధించిన వివరణాత్మక షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం అధికారులు సోమవారం సాయంత్రం విలేకరుల సమావేశంలో విడుదల చేయనున్నారు. వచ్చే ఏడాది ఎన్నికలు జరగనున్న రాష్ట్రాల్లో మొదటి దశ ప్రారంభమవుతుందని పలు వర్గాలు తెలిపాయి. తమిళనాడులో డీఎంకె, ఎఐఎడీఎంకెలు తీవ్ర పోటీలో ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌లో బీజేపీ వ్యతిరేకంగా అధికార టీఎంసీ పోటీ పడుతున్నాయి. కేరళలో ఎల్‌డిఎఫ్-యుడిఎఫ్ పోటీ, అస్సాంలో బీజేపీ బలమైన పట్టు, పుదుచ్చేరిలో కాంగ్రెస్-డీఎంకె కూటమి పాత్ర కీలకంగా ఉన్నాయి. ఈ రాష్ట్రాల్లో ఓటరు జాబితాలో ఏవైనా లోపాలు ఉంటే అది ఎన్నికల ఫలితాలను తీవ్రంగా ప్రభావితం చేస్తుంది. కాబట్టి ఈ రాష్ట్రాల్లో సర్ నమోదు సకాలంలో చేయడం చాలా ముఖ్యం. ఇటీవల సంవత్సరాలలో ఓటరు జాబితాను మరింత బలోపేతం చేయడానికి కమిషన్ డిజిటల్ టెక్నాలజీని ఉపయోగించుకుంది. ఓటరు హెల్ప్‌లైన్ యాప్‌లు, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్, బూత్ లెవల్ ఆఫీసర్ల పాత్రను పెంచింది. సర్ సమయంలో, ఇంటింటికి సర్వేలు, క్లెయిమ్‌లు, అభ్యంతరాలను ప్రాసెస్ చేయడం, ఫోటో %×ఐ% కార్డులను నవీకరించడం వంటి పనులు చేస్తారు. మొదటి దశ తర్వాత, దేశవ్యాప్తంగా ఏకరీతి ప్రక్రియను నిర్ధారించడానికి ఇతర రాష్ట్రాలను దశలవారీగా సర్ అమలులో చేర్చనున్నారు. రాజకీయ పార్టీలు ఓటర్ల నమోదు గురించి మరింత అప్రమత్తంగా ఉన్న సమయంలో ఈ ప్రకటన రావడం సంచలనం సృష్టించింది.



## పాక్ ప్రధాని, ఆర్మీచీఫ్‌పై ట్రంప్ ప్రశంసలు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మరోసారి అంతర్జాతీయ వేదికపై కీలక వ్యాఖ్యలు చేశారు. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య నెలకొన్న వివాదాన్ని తాను త్వరలోనే పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. పాకిస్థాన్ ప్రధాని షెహబాజ్ షరీఫ్, ఆ దేశ ఆర్మీ చీఫ్ ఫీల్డ్ మార్షల్ ఆసిమ్ మునీర్‌లను "గొప్ప వ్యక్తులు"గా ఆయన అభివర్ణించారు. థాయ్‌లాండ్, కంబోడియా మధ్య దీర్ఘకాలంగా ఉన్న వివాదానికి ముగింపు పలుకుతూ కుదిరిన శాంతి ఒప్పందంలో మధ్యవర్తిత్వం వహించిన ట్రంప్, అనంతరం మలేషియాలోని కౌలాలంపూర్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, "ఇది చాలా సుదీర్ఘమైన శాంతి కాబోతోంది. మా ప్రభుత్వం కేవలం 8 నెలల్లో 8 యుద్ధాలను ఆపింది. అంటే నెలకు సగటున ఒకటి అన్నమాట" అని పేర్కొన్నారు. రెండు వారాల క్రితం మొదలై అనేక మంది ప్రాణాలను బలిగొన్న పాక్-ఆఫ్ఘన్ వివాదంపై ఆయన స్పందించారు. "ఇప్పుడు ఒక్కటే మిగిలి ఉంది. పాకిస్థాన్, ఆఫ్ఘనిస్థాన్ మధ్య గొడవ మొదలైందని విన్నాను. దాన్ని కూడా చాలా వేగంగా పరిష్కరిస్తాను. వాళ్లిద్దరూ నాకు తెలుసు. పాకిస్థాన్ ఫీల్డ్ మార్షల్, ప్రధాని ఇద్దరూ గొప్ప వ్యక్తులు. ఆ సమస్యను మేం త్వరగా పరిష్కరిస్తామనడంలో నాకు ఎలాంటి సందేహం లేదు" అని ట్రంప్ వ్యాఖ్యానించారు. "నేను ఈ పనిని ఎంతో చక్కగా చేస్తాను. నేను చేయాల్సిన అవసరం లేదేమో, కానీ కొన్ని లక్షల ప్రాణాలను కాపాడగలిగితే అంతకంటే మంచి పని ఏముంటుంది? ఏ అధ్యక్షుడు ఒక్క యుద్ధాన్ని కూడా పరిష్కరించినట్లు నేను అనుకోను. వాళ్లు యుద్ధాలను ప్రారంభిస్తారు" అని ట్రంప్ అన్నారు.

# చైనా క్షిపణి రహస్యం భారత్ చేతిలో

**ఆపరేషన్ సిందూర్ సమయంలో గురి తప్పిన పాక్ క్షిపణి**

**పంజాబ్‌లో పడిపోవడంతో స్వాధీనం చేసుకున్న భారత దళాలు**

**సెల్ఫ్ డిస్ట్రక్ట్ వ్యవస్థ లేకపోవడంతో దొరికిన కీలక టెక్నాలజీ**

**చైనా తయారీ పీఎల్-15ఈ క్షిపణిపై డీఆర్‌డీవో లోతైన విశ్లేషణ**





న్యూఢిల్లీ: రక్షణ రంగంలో పాకిస్థాన్ చేసిన ఒక ఘోర తప్పిదం ఇప్పుడు భారత్‌కు ఊహించని వరంగా మారింది. ఇటీవల జరిగిన 'ఆపరేషన్ సిందూర్' సమయంలో పాకిస్థాన్ ప్రయోగించిన చైనా తయారీ పీఎల్-15ఈ అనే అత్యాధునిక క్షిపణి ఒకటి గురితప్పి భారత భూభాగంలో పడిపోయింది. దానిని స్వాధీనం చేసుకున్న భారత రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) శాస్త్రవేత్తలు, ఆ క్షిపణి సాంకేతిక రహస్యాలను విడమరుస్తూ మన అస్త్రాలను మరింత పదును పెడుతున్నారు. ఈ ఏడాది మే నెలలో జమ్మూకశ్మీర్‌లోని పహల్గామ్‌లో 26 మంది పౌరులను ఉగ్రవాదులు హత్య చేయడంతో, భారత్ ప్రతీకారంగా 'ఆపరేషన్ సిందూర్' చేపట్టింది. పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలు, సైనిక స్థావరాలపై దాడులు నిర్వహించింది. ఈ క్రమంలో ఇరు దేశాల వైమానిక దళాల మధ్య ఘర్షణ చోటుచేసుకుంది. ఆ సమయంలో పాకిస్థాన్ వాయుసేన, భారత యుద్ధవిమానాలను అడ్డుకునేందుకు చైనా నుంచి కొనుగోలు చేసిన పీఎల్-15ఈ క్షిపణులను ప్రయోగించింది. సుమారు 145 కిలోమీటర్ల దూరంలోని లక్ష్యాలను ఛేదించగల ఈ క్షిపణులను జేఎఫ్-17 లేదా జె-10సి ఫైటర్ జెట్ల నుంచి ప్రయోగించి ఉండవచ్చని అంచనా. అయితే, ఒక క్షిపణి లక్ష్యాన్ని చేరుకోకుండా పంజాబ్‌లోని హోషియార్‌పూర్ జిల్లాలోని ఓ వ్యవసాయ క్షేత్రంలో కూలిపోయింది. మే 9న దీనిని గుర్తించిన భారత బలగాలు, వెంటనే దాన్ని స్వాధీనం చేసుకుని డీఆర్‌డీవోకు అప్పగించాయి. సాధారణంగా ఇలాంటి అధునాతన క్షిపణులకు శత్రువుల చేతికి చిక్కకుండా స్వీయ నాశన వ్యవస్థ (సెల్ఫ్ డిస్ట్రక్ట్ మెకానిజం) ఉంటుంది. కానీ, ఈ పీఎల్-15ఈ క్షిపణికి ఆ వ్యవస్థ లేకపోవడం భారత్‌కు కలిసొచ్చింది. దీంతో దానిలోని సాంకేతిక పరిజ్ఞానం చెక్కుచెదరకుండా మన శాస్త్రవేత్తల చేతికి చిక్కింది. డీఆర్‌డీవో విశ్లేషణలో ఈ చైనా క్షిపణిలో అనేక కీలక సాంకేతిక అంశాలు ఉన్నట్లు తేలింది. ఇందులో ఉండే చిన్నపాటి ఏఈఎస్ఏ రాడార్, శత్రువుల జామింగ్‌ను తట్టుకునే వ్యవస్థ, డ్యుయల్ పల్స్ మోటార్, డేటా లింక్ ఎన్‌క్రిప్షన్ వంటివి భారత క్షిపణి టెక్నాలజీ అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడనున్నాయి.

# అక్టోబర్‌లో భారీగా బైక్‌ల అమ్మకాలు

**రికార్డు స్థాయికి చేరిన టూవీలర్ రిజిస్ట్రేషన్లు**

**జీఎస్టీ 2.0తో ధరలు తగ్గడమే ప్రధాన కారణం**



న్యూఢిల్లీ: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జీఎస్టీ 2.0, పండగ సీజన్ డిమాండ్ కలిసి రావడంతో ద్విచక్ర వాహన మార్కెట్ కొత్త ఉత్సాహంతో దూసుకెళుతోంది. అక్టోబరు నెలలో ఏకంగా 18.5 లక్షల (1.85 మిలియన్) వాహనాలు రిజిస్టర్ అయ్యాయి. ఈ ఏడాదిలో ఒక నెలలో నమోదైన అత్యధిక రిజిస్ట్రేషన్లు ఇవే కావడం విశేషం. వాహన్ పోర్టల్ డేటా ప్రకారం ఈ విషయం వెల్లడైంది. ఇటీవల జీఎస్టీ 2.0 విధానంలో భాగంగా 350%ఎెఎ% ఇంజిన్ సామర్థ్యం వరకు ఉన్న మోటార్‌సైకిళ్లపై జీఎస్టీని 28 శాతం నుంచి 18 శాతానికి ప్రభుత్వం తగ్గించింది. దీంతో వాహనాల ధరలు గణనీయంగా తగ్గి, కొనుగోలుదారుల్లో ఆసక్తి పెరిగింది. దీనికి తోడు దీపావళి పండగ సీజన్ కావడంతో పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు ఊపందుకున్నాయి. సెప్టెంబరు నెల నుంచే టూవీలర్ మార్కెట్‌లో సానుకూల వాతావరణం కనిపిస్తోంది. గత ఏడాదితో పోలిస్తే సెప్టెంబరులో కంపెనీల నుంచి డీలర్లకు సరఫరా అయ్యే వాహనాల (డిస్పాచ్) సంఖ్య 9 శాతం పెరిగి, 2 మిలియన్ల మార్కును దాటింది. దేశంలోనే అతిపెద్ద ద్విచక్ర వాహన తయారీ సంస్థ హీరో మోటోకార్ప్ సెప్టెంబర్‌లో 5 శాతం వృద్ధితో 6,47,582 యూనిట్లను విక్రయించింది. అదే నెలలో కంపెనీ రిజిస్ట్రేషన్లు 19 శాతం పెరిగి 3,23,230 యూనిట్లకు చేరాయి. ఇక ఇతర ప్రధాన కంపెనీల విషయానికొస్తే, హోండా మోటార్‌సైకిల్ అండ్ స్కూటర్ ఇండియా అమ్మకాలు 3 శాతం పెరిగి 5,05,000 యూనిట్లుగా నమోదు కాగా, టీవీఎస్ మోటార్ అమ్మకాలు 12 శాతం వృద్ధితో 4,13,000 యూనిట్లకు చేరాయి. బజాజ్ ఆటో 5 శాతం వృద్ధితో 2,73,000 యూనిట్లు, ఐషర్ మోటార్స్‌కు చెందిన రాయల్ ఎన్‌ఫీల్డ్ అమ్మకాలు ఏకంగా 43 శాతం వృద్ధితో 1,13,000 యూనిట్లుగా నమోదయ్యాయి. సెప్టెంబర్ ఆరంభంలో శ్రాద్ధ పక్షం (పితృ పక్షం) కారణంగా అమ్మకాలు కాస్త నెమ్మదించినా, పండగ సీజన్ మొదలవగానే ఒక్కసారిగా పుంజుకున్నాయని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. "జీఎస్టీ తగ్గింపు, కొత్త మోడళ్ల విడుదల, పండగ ఆఫర్లు కలిసి వినియోగదారుల్లో కొనుగోలు సెంటిమెంట్‌ను బలంగా పెంచాయి" అని ఓ విశ్లేషకుడు పేర్కొన్నారు. యాక్సిస్ సెక్యూరిటీస్ నివేదిక ప్రకారం, గత నెలలో మొత్తం ఆటోమొబైల్ రంగంలో మిశ్రమ ఫలితాలు కనిపించాయి. టూవీలర్లు, త్రీవీలర్లు, వాణిజ్య వాహనాల అమ్మకాలు బలంగా పెరిగినప్పటికీ, ప్యాసింజర్ కార్ల విక్రయాలు మాత్రం గతేడాదితో పోలిస్తే తగ్గుముఖం పట్టాయి.

# ఔరంగాబాద్ రైల్వేస్టేషన్ ఇక.. సీఎస్ఆర్

ఔరంగాబాద్: ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ పేరును ఛత్రపతి శంభాజీనగర్ రైల్వే స్టేషన్‌గా మార్చినట్లు దక్షిణ మధ్య రైల్వే తెలిపింది. పేరు మార్పును అధికారికంగా అమలు చేస్తున్నామని.. స్టేషన్‌లోని అన్ని సైన్‌బోర్డులు, టిక్కెట్లు, ప్రకటనలు డిజిటల్ సిస్టమ్స్‌లో కొత్త పేరును అప్‌డేట్ చేసినట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. స్టేషన్‌కు కొత్త కోడ్‌ను '%ఙూచీ%' అని తెలిపింది. మహారాష్ట్ర ప్రభుత్వ సిఫార్సు, హోం మంత్రిత్వ శాఖ ఆమోదం తర్వాత ఈ నిర్ణయం తీసుకున్నట్లు రైల్వే పేర్కొంది. మరాఠా యోధుడు ఛత్రపతి శంభాజీని గౌరవించే లక్ష్యంతో ఛత్రపతి శంభాజీనగర్ స్టేషన్‌కు కొత్త పేరును మార్చినట్లు పేర్కొంది. పేరు మార్పు తర్వాత స్టేషన్‌కు సంబంధించిన అన్ని సమాచారం, టికెట్లను కొత్త పేరుతోను ప్రయాణికులకు జారీ చేయనున్నట్లు రైల్వే అధికారుల తెలిపారు. ఇకపై స్టేషన్ పేరు 'ఛత్రపతి శంభాజీనగర్'గా అన్ని ప్లాట్‌ఫారమ్‌లు, రైళ్ల ప్రకటనల్లో వినిపిస్తుందని పేర్కొంది. ఇదిలా ఉండగా.. గతంలో 2022లో




అప్పటి ప్రభుత్వం ఔరంగాబాద్ నగరాన్ని ఛత్రపతి శంభాజీనగర్‌గా పేరు మార్చింది. ఛత్రపతి శివాజీ మహారాజ్ కుమారుడు, మరాఠా రాజ్యానికి రెండో పాలకుడు అయిన ఛత్రపతి శంభాజీ గౌరవార్థం ఈ నిర్ణయం తీసుకున్నారు. ఔరంగాబాద్‌కు గతంలో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు పేఢ ఉంది. ఔరంగాబాద్ నగరం పేరును ఛత్రపతి శంభాజీనగర్‌గా పేరు మార్చడానికి కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. తాజాగా రైల్వే స్టేషన్ పేరు మార్చడంతో ఈ ప్రక్రియ పూర్తయింది. బీజేపీ నేత, ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ నేతృత్వంలోని మహాయుతి ప్రభుత్వం అక్టోబర్ 15న పేరు మార్చడానికి గెజిట్ నోటిఫికేషన్ జారీ చేయడం గమనార్హం. మూడు సంవత్సరాల కిందట చరిత్రకారుల అభిప్రాయం ప్రకారం.. ఔరంగాబాద్ రైల్వే స్టేషన్ 1900లో హైదరాబాద్ ఏడో నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ పాలనలో ప్రారంభించారు. ఛత్రపతి శంభాజీనగర్ ఒక పర్యాటక కేంద్రం. నగరం చుట్టూ అనేక చారిత్రక కట్టడాలు ఉన్నాయి. ఇందులో అజంతా-ఎల్లోరా గుహలు కూడా ఉన్నాయి. ఐక్యరాజ్యసమితి, యునెస్కో వరల్డ్ హెరిటేజ్ లిస్ట్‌లో చేర్చింది.

## మహిళల్లోనే అల్జీమర్స్ అధికం

న్యూయార్క్: ప్రపంచవ్యాప్తంగా అల్జీమర్స్ వ్యాధితో బాధపడుతున్న వారిలో మూడింట రెండొంతుల మంది మహిళలేనన్నది ఆందోళన కలిగించే వాస్తవం. మహిళలు పురుషుల కన్నా ఎక్కువ కాలం జీవించడం వల్లే ఈ వ్యాధి వారిలో అధికంగా కనిపిస్తుందని ఇప్పటివరకు భావిస్తూ వచ్చారు. కానీ, అది ఒక్కటే కారణం కాదని, దీని వెనుక మరిన్ని సంక్లిష్టమైన జీవసంబంధ కారణాలు ఉన్నాయని తాజా అధ్యయనం తేల్చిచెప్పింది. మెదడులోని సూక్ష్మ మార్పులు, హార్మోన్ల ప్రభావం, జన్యుపరమైన తేడాలే మహిళలను అల్జీమర్స్‌కు ఎక్కువగా గురిచేస్తున్నాయని శాస్త్రవేత్తలు గుర్తించారు. అమెరికాకు చెందిన ప్రఖ్యాత సైన్స్ జర్నల్ 'ప్రొసీడింగ్స్ ఆఫ్ ది నేషనల్ అకాడమీ ఆఫ్ సైన్సెస్'లో ఈ అధ్యయన వివరాలు ప్రచురితమయ్యాయి. పరిశోధకులు 17 నుంచి 95 ఏళ్ల మధ్య వయసున్న 4,700 మంది ఆరోగ్యవంతులైన స్త్రీ, పురుషుల మెదడుకు సంబంధించిన 12,000కు పైగా ఎమ్మారై స్కాన్‌లను విశ్లేషించారు. పురుషుల సంబంధించిన పారాహిప్పోక్యాంపల్ కార్టెక్స్ వంటి ప్రాంతాలు వేగంగా క్షీణిస్తాయి.

## గ్యాంగ్‌స్టర్ లఖ్వీందర్ అరెస్టు

న్యూఢిల్లీ: వ్యవస్థీకృత నేరాలపై భారత ఏజెన్సీలు ఉక్కుపాదం మోపాయి. లారెన్స్ బిష్ణోయ్ గ్యాంగ్‌తో సంబంధాలున్న కీలక గ్యాంగ్‌స్టర్ లఖ్వీందర్ కుమార్‌ను అమెరికా నుంచి భారత్‌కు విజయవంతంగా రప్పించారు. శనివారం ఢిల్లీ విమానాశ్రయంలో అడుగుపెట్టిన వెంటనే హర్యానా పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. ఈ విషయాన్ని కేంద్ర దర్యాప్తు సంస్థ (సీబీఐ) ఒక ప్రకటనలో వెల్లడించింది. లఖ్వీందర్‌పై హర్యానాలో హత్యాయత్నం, బెదిరించి డబ్బులు వసూలు చేయడం, అక్రమ ఆయుధాలు కలిగి ఉండటం వంటి పలు తీవ్రమైన క్రిమినల్ కేసులు నమోదై ఉన్నాయి. ఈ కేసుల నేపథ్యంలో అతడు విదేశాలకు పారిపోయాడు. దీంతో హర్యానా పోలీసులు చేసిన విజ్ఞప్తి మేరకు, సీబీఐ ఇంటర్‌పోల్ ద్వారా 2024 అక్టోబర్ 26న అతడిపై రెడ్ కార్నర్ నోటీసు జారీ చేసింది. సీబీఐ, విదేశాంగ శాఖ, హోం మంత్రిత్వ శాఖల సమన్వయంతో అమెరికా అధికారులతో సంప్రదింపులు జరిపి లఖ్వీందర్‌ను భారత్‌కు బహిష్కరించేలా చర్యలు తీసుకున్నాయి. ఈ ఉమ్మడి ఆపరేషన్ ఫలించి, నిన్న అతడిని భారత్‌కు తీసుకువచ్చారు. ఇలాంటి నేరస్థులను పట్టుకోవడానికి ప్రపంచవ్యాప్తంగా ఉన్న చట్ట సంస్థలకు ఇంటర్‌పోల్ రెడ్ కార్నర్ నోటీసులు ఎంతగానో ఉపయోగపడతాయి. భారత్‌లో ఇంటర్‌పోల్ వ్యవహారాలను సీబీఐ నోడల్ ఏజెన్సీగా పర్యవేక్షిస్తోంది. ఈ యంత్రాంగం ద్వారా ఇటీవలి సంవత్సరాలలో 130 మందికి పైగా పరారీలో ఉన్న నేరస్థులను విదేశాల నుంచి భారత్‌కు రప్పించినట్లు అధికారులు తెలిపారు. గత నెల సెప్టెంబర్ 2న కూడా ఇదే తరహాలో హత్య కేసులో జీవిత ఖైదు పడి పారిపోయిన మెయిన్‌పాల్ ఢిల్లా అనే మరో నేరస్థుడిని కంబోడియా నుంచి భారత్‌కు తీసుకువచ్చిన విషయం తెలిసిందే.

## అమెరికా అధ్యక్షురాలిని అవుతా

**కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు**



వాషింగ్టన్: అమెరికా అధ్యక్ష పదవిపై మాజీ ఉపాధ్యక్షురాలు కమలా హారిస్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. తాను మరోసారి అధ్యక్ష పదవికి పోటీ చేసే అవకాశం లేకపోలేదని ఆమె పేర్కొన్నారు. భవిష్యత్తులో అమెరికా అధ్యక్షురాలిగా ఒక మహిళ వైట్‌హౌస్‌లో ఉండడం ఖాయమని, "బహుశా అది నేనే కావచ్చు" అని వ్యాఖ్యానించారు. ఓ వార్తాసంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో కమలా హారిస్ మాట్లాడుతూ అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌పై తీవ్ర విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో ట్రంప్ ఫాసిస్ట్ ధోరణితో వ్యవహరిస్తారని హెచ్చరించానని, ఇప్పుడు అది నిరూపితమైందని ఆమె అన్నారు. "నా మనవరాళ్లు వారి జీవితంలో ఖచ్చితంగా ఓ మహిళా అధ్యక్షురాలిని చూస్తారు" అని ఆమె పేర్కొన్నారు. అధ్యక్ష ఎన్నికల్లో మరోసారి పోటీ చేసే విషయంపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని, కానీ రాజకీయాల్లో భవిష్యత్తు ఉందని ఇప్పటికీ నమ్ముతున్నానని హారిస్ పేర్కొన్నారు. తాను చేయాల్సిన పని ఇంకా పూర్తి కాలేదన్నారు. తన కెరీర్ మొత్తాన్ని సేవలో గడిపానని, అది తన రక్తంలోనే ఉందని ఆమె అన్నారు. అలాగే, తదుపరి ఎన్నికల్లో డెమోక్రటిక్ పార్టీ తరఫున పోటీ చేసే అవకాశాలపై స్పందిస్తూ, "పోల్స్ గురించి పట్టించుకోవడం లేదు. వాటిని నమ్మి ఉంటే, నేను ఇంతవరకు రాజకీయాల్లో ఉండేదాన్ని కాదు" అని ఆమె అన్నారు. గత 2024 అధ్యక్ష ఎన్నికల్లో కమలా హారిస్ ట్రంప్‌పై డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి చవిచూసిన విషయం తెలిసిందే.

## దేశంలో 22 ఫేక్ యూనివర్సిటీలు

న్యూఢిల్లీ: ఢిల్లీ-కోట్లా ముబారక్‌పుర్‌లోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ అండ్ ఇంజినీరింగ్ సంస్థ విషయంలో యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ తాజాగా మరోసారి హెచ్చరికలు జారీ చేసింది. అనుమతులు లేని డిగ్రీ కోర్సులను నిర్వహిస్తోందని పేర్కొంది. ఆ సంస్థ జారీ చేసే డిగ్రీలకు ఎలాంటి విలువ లేదని తెలిపింది. అసలు ఈ విశ్వవిద్యాలయాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు సంబంధించి ఏ చట్టం కింద ప్రారంభించలేదని యూజీసీ స్పష్టం చేసింది. యూజీసీ డేటా ప్రకారం దేశంలో 22 గుర్తింపులేని యూనివర్సిటీలను నిర్వహిస్తున్నారని తేలింది. వీటిల్లో 9 దేశ రాజధాని దిల్లీలో ఉన్నాయి. ఐదు ఉత్తర్‌ప్రదేశ్‌లో ఉండగా.. మిగిలినవి కేరళ, పశ్చిమబెంగాల్, మహారాష్ట్ర, ఆంధ్రప్రదేశ్, పాండిచ్చేరిల్లో నిర్వహిస్తున్నట్లు యూజీసీ గణాంకాలు చెబుతున్నాయి. ఢిల్లీలోని విద్యార్థులను బ్రోకర్ నెట్‌వర్క్‌లతో మాయచేసి.. ఈ విశ్వవిద్యాలయాలు ఆకర్షిస్తున్నాయి. తమ సంస్థలకు పేర్లు పెట్టే సమయంలో 'నేషనల్', టెక్నాలజీ, మేనేజ్‌మెంట్, ఇన్‌స్టిట్యూట్ వంటి పదాలు వాడుతున్నారు. ఇక యూపీలో విద్యాపథ్, పరిషద్, ఓపెన్ యూనివర్సిటీ వంటి పదాలను వినియోగిస్తున్నారు.

## జేడీయూలో 16 మందిపై వేటు

పాట్నా: బీహార్ అసెంబ్లీ ఎన్నికల వేళ అధికార జేడీయూకు రెబల్స్ వ్యవహారం తలనొప్పిగా మారింది. పార్టీకి చెందిన పలువురు నేతలు ఆయా స్థానాల్లో సొంత కూటమి అభ్యర్థులపైనే పోటీకి దిగారు. దీంతో ఈ వ్యవహారాన్ని తీవ్రంగా పరిగణించిన అధిష్ఠానం.. రెండు రోజుల వ్యవధిలో 16 మందిపై బహిష్కరణ వేటు వేసింది. ఓ సిట్టింగ్ ఎమ్మెల్యేతోపాటు ఇద్దరు మాజీ మంత్రులు ఈ జాబితాలో ఉన్నారు. భాగల్‌పూర్ జిల్లా గోపాల్‌పుర్ సిట్టింగ్ ఎమ్మెల్యే నరేంద్ర నీరజ్ ఎలియాస్ గోపాల్ మండల్ ఆ స్థానం వరుసగా నాలుగుసార్లు గెలిచారు. అయితే.. ఈసారి పార్టీ తనకు టికెట్ ఇచ్చే అవకాశం లేదని తెలుసుకున్న ఆయన ఇటీవల పట్నాలోని సీఎం నీతీశ్ కుమార్ నివాసం ఎదుట ధర్నాకు దిగారు. చివరకు నిరాశే ఎదురుకావడంతో.. స్వతంత్ర అభ్యర్థిగా బరిలోకి దిగారు. మాజీ మంత్రులు శైలేశ్ కుమార్, హిమ్‌రాజ్ సింగ్ సైతం ఆయా స్థానాల నుంచి స్వతంత్రులుగా పోటీ చేస్తున్నారు. వీరితోపాటు మాజీ ఎమ్మెల్యేలు మహేశ్వర్ ప్రసాద్ యాదవ్, శ్యామ్‌బహదూర్ సింగ్, సుదర్శన్ కుమార్, మాజీ ఎమ్మెల్సీలు సంజయ్ ప్రసాద్, రణ్‌విజయ్ సింగ్, సంజీవ్ శ్యామ్ సింగ్‌లపైనా జేడీయూ చర్యలు తీసుకుంది.

## వెండిపైనా రుణాలు

**ఆర్బీఐ కీలక నిర్ణయం!**



న్యూఢిల్లీ: బంగారంపై రుణాల మాదిరిగానే ఇకపై వెండిపై కూడా రుణాలు లభించనున్నాయి. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) ఈ మేరకు కీలక నిర్ణయం తీసుకుంది. కొత్త మార్గదర్శకాలు 2026 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి రానున్నాయి. ఆర్బీఐ తాజా ఆదేశాల ప్రకారం వాణిజ్య బ్యాంకులు, బ్యాంకింగ్‌యేతర ఆర్థిక సంస్థలు (ఎన్‌బీఎఫ్‌సీఎస్) వెండి నగలు, ఆభరణాలు, కాయిన్స్‌ను తనఖా పెట్టుకుని రుణాలు మంజూరు చేయవచ్చు. అయితే వెండి కడ్డీలు, ఈటీఎఫ్‌లపై రుణాలు ఇవ్వరాదని స్పష్టం చేసింది. ఒక వ్యక్తి గరిష్టంగా 10 కేజీల వరకు వెండిని తాకట్టు పెట్టి రూ.10 లక్షల వరకు రుణం పొందవచ్చు. అలాగే 500 గ్రాముల బరువులోపు సిల్వర్ కాయిన్స్ తాకట్టు పెట్టుకోవడానికి అనుమతి ఉంది. రుణ పరిమాణం వెండి ప్రస్తుత మార్కెట్ విలువ ఆధారంగా నిర్ణయించబడుతుందని పేర్కొంది. ప్రస్తుతం దేశీయ మార్కెట్‌లో వెండి ధర కేజీకి రూ.1.70 లక్షల వద్ద ఉంది. కొన్ని నెలల క్రితం రూ.2 లక్షల మార్క్ దాటిన సంగతి తెలిసిందే.

## వయ్యారి చిత్రం



## విలన్ ఫ్యామిలీతో 'జైలర్' ఢీ




జైలర్ లాంటి ఇండస్ట్రీ హిట్‌కు సీక్వెల్ తీయాలంటే, డైరెక్టర్ నెల్సన్ దిలీప్‌కుమార్ మీద ఒత్తిడి మామూలుగా ఉండదు. ఫస్ట్ పార్ట్‌లో రజినీకాంత్ స్వాగ్, అనిరుధ్ బీజీఎం, స్టార్ కాస్టింగ్ గెస్ట్ రోల్స్ అదిరిపోయాయి. కానీ, ఆ మ్యాజిక్‌ను రిపీట్ చేయడం కుదరదు, దాన్ని మించిపోవాలి. అందుకే నెల్సన్ ఈసారి కేవలం గెస్ట్ రోల్స్ మీద కాకుండా, కథనం మీద గట్టిగా ఫోకస్ పెట్టినట్లు కనిపిస్తోంది. 'జైలర్ 1'లో విలన్ గ్యాంగ్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. కానీ 'జైలర్ 2'లో ఆ విలనిజాన్ని మరో లెవల్‌కు తీసుకెళ్లబోతున్నారు. ఈసారి ముత్తువేల్ పాండియన్ (రజినీ) ఢీకొట్టేది ఒక సింగిల్ విలన్‌తో కాదు, ఏకంగా ఒక విలన్ ఫ్యామిలీతో అని గట్టిగా టాక్ నడుస్తోంది. ఈ పాయింటే సినిమాపై అంచనాలను పెంచుతోంది. ఈ విలన్ సామ్రాజ్యానికి హెడ్‌గా బాలీవుడ్ సీనియర్ స్టార్ మిథున్ చక్రవర్తిని ఫిక్స్ చేశారని సమాచారం. అయితే, ఈ విలన్ గ్యాంగ్‌లో అసలైన సర్‌ప్రైజ్ ప్యాకేజ్ లో మరొకరు ఉన్నారు. ఆ పాత్ర కోసమే నేషనల్ అవార్డ్ విన్నర్, బాలీవుడ్ ఫైర్‌బ్రాండ్ విద్యా బాలన్‌ను రంగంలోకి దించుతున్నారని తెలుస్తోంది. ఇక్కడే అసలు ట్విస్ట్ మొదలైంది. విద్యా బాలన్ ఈ సినిమాలో రజినీకి జోడీగానో, మరో కీలక పాత్రలోనో కాకుండా.. ఏకంగా మెయిన్ విలన్ అయిన మిథున్ చక్రవర్తి కూతురిగా నటించబోతున్నారట.

## త్వరలో స్వయంభు అప్‌డేట్

టాలీవుడ్ యాక్టర్ నిఖిల్ సిద్దార్థ కాంపౌండ్ నుంచి వస్తోన్న తాజా ప్రాజెక్ట్ స్వయంభు. నిఖిల్ 20గా నిఖిల్ తొలి పాన్ ఇండియా చిత్రంగా వస్తోన్న ఈ చిత్రంలో మలయాళ భామ సంయుక్తామీనన్ ఫీమేల్ లీడ్ రోల్‌లో నటిస్తోంది. కాగా ఈ మూవీ నుంచి అదిరిపోయే వార్త రాబోతుందని చెప్పింది నిఖిల్ టీం. ఉత్తేజాన్ని అందించే, జ్ఞానోదయాన్ని కలిగించే నిఖిల్ స్వయంభు ప్రయాణం.. మోస్ట్ ఎక్జయిటింగ్ అనౌన్స్‌మెంట్ త్వరలోనే రాబోతుందంటూ మేకర్స్ తెలియజేశారు. ఇంతకీ ఆ ఆసక్తికర వార్త ఏంటని తెగ చర్చించుకుంటున్నారు సినీ జనాలు. ఈ చిత్రానికి భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్నాడు. ఠాగూర్ మధు సమర్పణలో పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో గ్రాండ్‌గా విడుదల చేస్తున్నారు. స్వయంభులో నిఖిల్ యుద్ధ వీరుడిగా ఇదివరకెన్నడూ కనిపించని సర్‌ప్రైజింగ్ లుక్‌లో మెరువబోతున్నట్టు ఇప్పటివరకు షేర్ చేసిన పోస్టర్లు చెబుతున్నాయి.




## హైదరాబాద్‌లో రెహమాన్ 'పెద్ది' కన్సర్ట్

మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్ హీరోగా బాలీవుడ్ బ్యూటీ జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తున్న గ్రామీణ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. బుచ్చిబాబు సాన దర్శకత్వంలో రూపొందుతున్న ఈ చిత్రం ప్రస్తుతం శ్రీలంకలో రొమాంటిక్ సాంగ్ షూటింగ్‌లో ఉంది. ఇప్పటికే విడుదలైన పోస్టర్స్, గ్లింప్స్ అభిమానుల్లో భారీ అంచనాలను రేకెత్తించాయి. అయితే తాజాగా ఈ సినిమా నుంచి ఫస్ట్ సింగిల్‌కి సంబంధించి ఒక అప్‌డేట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. దర్శకుడు బుచ్చిబాబు ఇటీవల జరిగిన మీడియా సమావేశంలో మొదటి సింగిల్‌ను రాబోయే 10-15 రోజుల్లో విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అయితే సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న లేటెస్ట్ గాసిప్ ఏమిటంటే ఆస్కార్ విజేత, సంగీత దిగ్గజం ఏఆర్ రెహమాన్ నవంబర్ 8న హైదరాబాద్‌లోని రామోజీ ఫిల్మ్ సిటీలో నిర్వహించే 'ది వండర్‌మెంట్ హైదరాబాద్' మ్యూజిక్ కాన్సర్ట్‌లో 'పెద్ది' సినిమా ఫస్ట్ సింగిల్ రిలీజ్ కావచ్చని తెలుస్తుంది.

## ఉగ్రవాదిగా సల్మాన్ ఖాన్!



బాలీవుడ్ సూపర్‌స్టార్ సల్మాన్ ఖాన్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు పెద్ద వివాదానికి కారణమయ్యాయి. పాకిస్తాన్ ప్రభుత్వం ఆయనను "ఉగ్రవాది" గా ప్రకటిస్తూ అధికారిక నోటిఫికేషన్ జారీ చేసింది. ఈ నిర్ణయం ప్రస్తుతం అంతర్జాతీయ స్థాయిలో చర్చకు దారి తీసింది. ఇటీవల సౌదీ అరేబియాలో జరిగిన 'జాయ్ ఫోరమ్ 2025' కార్యక్రమంలో సల్మాన్ ఖాన్ పాల్గొన్నారు. అక్కడ మాట్లాడుతూ.. సౌదీ అరేబియాలో హిందీ సినిమాలు సూపర్‌హిట్ అవుతున్నాయి. తమిళం, తెలుగు, మలయాళం సినిమాలు కూడా మంచి ఆదరణ పొందుతున్నాయి. ఇక్కడ పాకిస్తాన్ నుంచి, ఆఫ్ఘనిస్తాన్ నుంచి, బలూచిస్తాన్ నుంచి కూడా వచ్చిన వారు చాలా మంది ఉన్నారు అని అన్నారు. అయితే ఇక్కడే వివాదం మొదలైంది. సల్మాన్ "పాకిస్తాన్" , "బలూచిస్తాన్"ను వేర్వేరుగా ప్రస్తావించడంతో పాకిస్తాన్ ప్రభుత్వం తీవ్రంగా స్పందించింది.



## గ్లామర్ షో చేస్తే తప్పేంటి?: మడోన్నా సెబాస్టియన్

మలయాళ, తమిళ సినిమాలతో గుర్తింపు పొందిన మడోన్నా సెబాస్టియన్ ప్రేమమ్ సినిమాతో ప్రత్యేక ఇమేజ్ ఏర్పరచుకుంది. తెలుగులో ఆమె రెండు సినిమాల్లో నటించింది, అందులో ఒకటి ప్రేమమ్ రీమేక్ , రెండోది నాని హీరోగా వచ్చిన శ్యామ్ సింగరాయ్. ఈ సినిమాలతో తెలుగు ప్రేక్షకుల మన్ననలు పొందిన మడోనా, సినిమా అవకాశాలు దక్కించుకోలేకపోయింది. అయితే మడోన్నాకి సినిమా అవకాశాలు రాకపోయిన కూడా పెద్దగా గ్లామర్ షో చేయదు. అయితే ఇటీవల సోషల్ మీడియాలో షేర్ చేసిన ఫోటో అందరు షాక్ అయ్యేలా చేసింది. పొట్టి బట్టలు ధరించి గ్లామర్ షో చేసిన ఫోటో చూసి ఆమె ఫ్యాన్స్ షాక్ అయ్యారు. కొంత మంది ఫ్యాన్స్ ఆమెను ట్యాగ్ చేస్తూ అసభ్యమైన కామెంట్లు చేశారు. ఈ విషయంపై మడోన్నా స్పందిస్తూ, "గ్లామర్ షో చేయడం తప్పు కాదు.. కానీ గ్లామర్ కు , అసభ్యతకు మధ్య వ్యత్సాసం ఏంటనేది తెలిస్తే చాలు.. అది నాకు తెలుసు కాబట్టి నేనెం చేస్తున్నానో నాకు అర్థమవుతుంది.. అంటూ కౌంటరిచ్చింది.

## బుకింగ్స్‌లో అదరగొట్టిన 'బాహుబలి ది ఎపిక్' !

రాజమౌళి 'బాహుబలి: ది ఎపిక్' అనే కొత్త వెర్షన్‌ను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నారు. రెండు భాగాలు కలిపి, రీ-కట్ చేసి, రీ-మాస్టర్ చేసిన ఈ చిత్రం అక్టోబర్ 31న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ నేపథ్యంలో ముందస్తు బుకింగ్‌లు భారీ సంఖ్యలో ప్రారంభమయ్యాయి. కేవలం 24 గంటల్లోనే, హైదరాబాద్, బెంగళూరు మరియు ఇతర ప్రాంతాలలో అడ్వాన్స్ బుకింగ్‌ల ద్వారా దాదాపు 61 వేల టిక్కెట్లు అమ్ముడయ్యాయి. పూర్తి బుకింగ్‌లు ప్రారంభమైన తర్వాత ఈ సంఖ్య భారీగా పెరిగే అవకాశం ఉంది.







## సమంత డబుల్ రోల్

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత చాలా రోజుల తర్వాత మళ్లీ కెమెరా ముందుకు వచ్చింది. హెల్త్ ఇష్యూస్ కారణంగా లాంగ్ బ్రేక్ తీసుకున్న సామ్, ఇప్పుడు ఫుల్ ఎనర్జీతో రీ-ఎంట్రీకి రెడీ అయ్యారు. అభిమానులు ఎప్పటినుంచో ఎదురు చూస్తున్న ఆమె సోలో పర్ఫార్మెన్స్ ఇప్పుడు పెద్ద తెరపై కనిపించబోతోంది. 'ఖుషి' (2023) తర్వాత సమంతని మళ్లీ ఒక పవర్‌ఫుల్ లీడ్ రోల్‌లోచూడాలని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈసారి ఆమె కేవలం హీరోయిన్‌గానే కాకుండా ప్రొడ్యూసర్‌గా కూడా బరిలోకి దిగుతున్నారు. సమంత తన సొంత బ్యానర్ 'ట్రాలాలా మూవింగ్ పిక్చర్స్' పై నిర్మిస్తున్న చిత్రం 'మా ఇంటి బంగారం'. ఈ ప్రాజెక్ట్‌ను ఆమె చాలా ప్రెస్టీజియస్‌గా తీసుకున్నారు. సినిమా అనౌన్స్ అయినప్పటి నుంచే ఇండస్ట్రీలో మంచి బజ్ క్రియేట్ అయింది. లేటెస్ట్ అప్‌డేట్ ప్రకారం, ఈ సినిమా షూటింగ్ ప్రస్తుతం రామోజీ ఫిల్మ్ సిటీలో వేగంగా కొనసాగుతోంది. సమంతతో పాటు మిగిలిన స్టార్ కాస్ట్‌పై కీలకమైన సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. ఈ సినిమాకు దర్శకత్వం వహిస్తున్నది 'ఓ బేబీ' ఫేమ్ నందిని రెడ్డి. సమంత-నందిని కాంబినేషన్ మళ్లీ రిపీట్ అవుతుండటంతో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి.

# ఆడకపోతే పంపించేస్తా

## హర్షిత్ రాణాకు గంభీర్ హెచ్చరిక





సిడ్నీలో మ్యాచ్‌కు ముందు బౌలర్ హర్షిత్ రాణా ప్రదర్శనపై కోచ్ గంభీర్ తీవ్ర అసంతృప్తితో ఉన్నట్లు తెలిసింది. ఒక దశలో సరిగ్గా ఆడకపోతే.. జట్టులో కొనసాగడం సాధ్యంకాదని తేల్చిచెప్పినట్లు సమాచారం. ఈ విషయాన్ని రాణా చిన్ననాటి కోచ్ శ్రవణ్ వెల్లడించాడు. ఆసియాకప్‌లో పేలవ ప్రదర్శన చేసిన హర్షిత్ రాణాను ఆస్ట్రేలియాతో వన్డే జట్టులోకి తీసుకోవడంతో కోచ్ గౌతమ్ గంభీర్‌పై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. అయితే.. కోచ్ అతడిని వెనకేసుకొచ్చి మీడియా, విశ్లేషకులకు కౌంటర్లు ఇచ్చాడు. కానీ, ఆసీస్ టూర్‌లో తొలి రెండు మ్యాచ్‌ల్లో అంతంత మాత్రంగానే రాణించడంతో.. ఇక లాభం లేదనుకొని రాణాను తీవ్రంగా హెచ్చరించాడు. ఈ విషయాన్ని హర్షిత్ తనకు మ్యాచ్‌కు ముందు ఫోన్ చేసి వెల్లడించాడని శ్రవణ్ తెలిపాడు. "హర్షిత్ మ్యాచ్‌కు ముందు నాకు ఫోన్ చేశాడు. తన ప్రదర్శనపై బయట నుంచి వస్తున్న విమర్శలకు దూరంగా ఉండాలనుకుంటున్నట్లు వెల్లడించాడు. దీంతో నిన్ను నువ్వు విశ్వసించు అని పేర్కొన్నాను. కొందరు క్రికెటర్లు కోచ్ గంభీర్‌కు హర్షిత్ దగ్గరి వ్యక్తి అని చెబుతుంటారు. కానీ, ప్రతిభ ఎక్కడ ఉందో గుర్తించి.. వారికి గంభీర్ మద్దతుగా ఉంటాడు. చాలా క్రికెటర్లకు అండగా నిలిచాడు. వారంతా కెరీర్‌లో అద్భుతాలు చేశారు. వాస్తవానికి ఆయన హర్షిత్‌ను తీవ్రంగా మందలించాడు. 'ఆటలో రాణించు.. లేకపోతే జట్టు బయట కూర్చోబెడతా' అని నేరుగా హర్షిత్‌కే చెప్పాడు. రాణా ఇంకా 23 ఏళ్ల కుర్రాడే.. అతడికి కొంత సమయం ఇవ్వాలి" అని శ్రవణ్ వ్యాఖ్యానించాడు. ఈ క్రమంలో హర్షిత్‌పై తీవ్ర విమర్శలు చేసిన మాజీ క్రికెటర్ శ్రీకాంత్‌ను తప్పుపట్టారు. యూట్యూబ్ చానల్స్‌కు ఆదాయం కోసం చిన్న కుర్రాళ్లను కూడా లక్ష్యంగా చేసుకుంటున్నారని అన్నాడు.

## కేకేఆర్ హెడ్ కోచ్‌గా అభిషేక్ నాయర్



కోల్‌కతా నైట్ రైడర్స్‌కు కొత్త ప్రధాన కోచ్ వచ్చేస్తున్నాడు. గత ఐపీఎల్‌లో ఘోర ప్రదర్శన అనంతరం ప్రధాన కోచ్‌గా ఉన్న చంద్రకాంత్ పండిత్‌ను కేకేఆర్ తప్పించిన సంగతి తెలిసిందే. ఆయన స్థానంలో మాజీ క్రికెటర్ అభిషేక్ నాయర్‌కు అవకాశం ఇవ్వనున్నట్లు సమాచారం. అధికారికంగా ప్రకటించడమే తరువాయి. గతంలో అభిషేక్ భారత క్రికెట్ జట్టుకు అసిస్టెంట్ కోచ్‌గానూ బాధ్యతలు నిర్వర్తించాడు. కోల్‌కతా ఫ్రాంచైజీతో అభిషేక్ నాయర్‌కు ఎంతో అనుబంధం ఉంది. ఈ జట్టుకు బ్యాటింగ్ కోచ్‌గా పనిచేసిన సమయంలో ఆటగాళ్ల ఫామ్‌పై దృష్టిసారించి సత్ఫలితాలు సాధించాడు. ఇక ప్లేయర్ల ఫిట్‌నెస్ విషయంలోనూ శ్రద్ధ కనబరుస్తాడు. ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ రోహిత్ శర్మ. అభిషేక్ పర్యవేక్షణలోనే నాజూగ్గా తయారై ఆసీస్ పర్యటనకు వెళ్లిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ప్రధాన కోచ్‌గా కేకేఆర్ తీసుకోనుండటంతో కొత్త అధ్యాయం మొదలుకానుంది. గంభీర్ మెంటార్‌గా (2024 సీజన్) ఉన్నప్పుడు విజేతగా నిలిచిన కేకేఆర్‌ను మళ్లీ విజయాలబాట పట్టించాల్సిన బాధ్యత అభిషేక్‌పై ఉంది.




# బదులు తీర్చుకుంటుందా?

## 29 నుంచి ఆసీస్-టీమిండియా టీ20 సిరీస్

### భారత్-ఆస్ట్రేలియా టీ20 సిరీస్ షెడ్యూల్

భారత్, ఆస్ట్రేలియా మధ్య టీ20 సిరీస్‌లో మొత్తం ఐదు మ్యాచ్‌లు ఆడతారు. అక్టోబర్ 29న కాన్‌బెర్రాలో జరిగే మొదటి మ్యాచ్‌తో ఈ సిరీస్ మొదలవుతుంది. ఈ సిరీస్‌లోని చివరి మ్యాచ్ నవంబర్ 8న బ్రిస్బేన్‌లో జరుగుతుంది. అన్ని టీ20 మ్యాచ్‌లు భారత కాలమానం ప్రకారం మధ్యాహ్నం 1 గంట 45 నిమిషాలకు ప్రారంభమవుతాయి.

| మొదటి టీ20 | అక్టోబర్ 29 | కాన్‌బెర్రా |
|---|---|---|
| రెండో టీ20 | అక్టోబర్ 31 | మెల్‌బోర్న్ |
| మూడో టీ20 | నవంబర్ 2 | హెుబార్ట్ |
| నాలుగో టీ20 | నవంబర్ 6 | గోల్డ్ కోస్ట్ |
| ఐదో టీ20 | నవంబర్ 8 | బ్రిస్బేన్ |

భారత్-ఆస్ట్రేలియా మధ్య జరిగిన వన్డే సిరీస్ ముగిసింది. ఈ సిరీస్‌ను ఆస్ట్రేలియా 2-1 తేడాతో గెలుచుకుంది. వన్డే సిరీస్ తర్వాత భారత జట్టు ఇప్పుడు ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్ ఆడనుంది. ఈ ఐదు మ్యాచ్‌ల సిరీస్ అక్టోబర్ 29 నుంచి నవంబర్ 8 వరకు జరగనుంది. ఈ సిరీస్ కోసం భారత టీ20 జట్టు కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్, మిగిలిన ఆటగాళ్లు ఆస్ట్రేలియా చేరుకున్నారు. వన్డే సిరీస్ ఓటమి తర్వాత, టీ20 ఫార్మాట్‌లో భారత్ ఎలా రాణిస్తుందో చూడాలి.

**భారత జట్టు:** సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), అభిషేక్ శర్మ, తిలక్ వర్మ, శివమ్ దూబె, నితీష్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), వరుణ్ చక్రవర్తి, జస్‌ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.

**ఆస్ట్రేలియా జట్టు:** మిచ్ మార్ష్ (కెప్టెన్), ట్రావిస్ హెడ్, సీన్ అబాట్, జేవియర్ బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ ద్వార్షుయిస్, నాథన్ ఎల్లిస్, జోష్ హేజిల్‌వుడ్, జోష్ ఇంగ్లిస్ (వికెట్ కీపర్), మ్యాథ్యూ కుహ్నెమన్, మిచెల్ ఓవెన్, మ్యాథ్యూ షార్ట్, మార్కస్ స్టోయినిస్, ఆడమ్ జంపా.



## సౌతాఫ్రికా సిరీస్‌కు అయ్యర్ దూరం?

టీమిండియాకు బిగ్ షాక్ తగిలింది. వన్డే జట్టు వైస్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ సిడ్నీలో ఆస్ట్రేలియాతో జరిగిన మూడో వన్డే మ్యాచ్‌లో గాయపడ్డాడు. హర్షిత్ రాణా వేసిన బంతికి అలెక్స్ కేరీ క్యాచ్ పడుతున్న సమయంలో శ్రేయస్ అయ్యర్ ఎడమ పక్కటెముకలకు గాయం తగిలింది. ప్రాథమిక నివేదిక ప్రకారం.. శ్రేయస్ అయ్యర్ దాదాపు మూడు వారాల పాటు మైదానానికి దూరంగా ఉండాల్సి వస్తుంది. శనివారం ఈ సంఘటన జరిగింది. శ్రేయస్ అయ్యర్ డీప్ స్క్వేర్ లెగ్‌లో ఫీల్డింగ్ చేస్తుండగా.. అలెక్స్ కేరీ కొట్టిన షాట్ వేగంగా అతని వైపు వచ్చింది. శ్రేయస్ అయ్యర్ అద్భుతంగా డైవ్ చేసి క్యాచ్ పట్టినప్పటికీ.. అదే సమయంలో అతని పక్కటెముకలకు బలంగా తగిలింది. వెంటనే వైద్య సిబ్బంది మైదానంలోకి వచ్చి ముందు జాగ్రత్తగా స్కానింగ్ కోసం శ్రేయస్ అయ్యర్‌ను సిడ్నీలోని ఆస్పత్రికి తరలించారు. ఈ గాయం కారణంగా శ్రేయస్ అయ్యర్ దక్షిణాఫ్రికా పర్యటనలో ఆడటం అనుమానాస్పదంగా మారింది. భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య తొలి వన్డే నవంబర్ 30న రాంచీలో జరగనుంది. ఈ సమయానికి శ్రేయస్ అయ్యర్ ఫిట్‌గా ఉంటాడో లేదో ఇప్పుడే చెప్పలేమని బీసీసీఐ వర్గాలు వెల్లడించాయి. "రాంచీ వన్డేకు అతను అందుబాటులో ఉంటాడా లేదా అనేది ఇప్పుడే చెప్పడం తొందరపాటు అవుతుంది. అంతా మెడికల్ రిపోర్ట్‌పై ఆధారపడి ఉంటుంది" అని బీసీసీఐ వర్గాలు పేర్కొన్నాయి.



## రోహిత్ శర్మ గుడ్ బై!

టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ ఆస్ట్రేలియాకు గుడ్‌బై చెప్పాడు. ముఖ్యంగా తనకు అచ్చొచ్చిన సిడ్నీ నగరానికి వీడ్కోలు పలికాడు. ఇందుకు సంబంధించిన ఫొటోను రోహిత్ సోషల్ మీడియా వేదికగా పంచుకున్నాడు. 'చివరిసారిగా సిడ్నీ నగరానికి వీడ్కోలు చెబుతున్నాను'అనే క్యాప్షన్‌తో గుడ్ బై చెబుతున్న ఫొటోను షేర్ చేశాడు. ప్రస్తుతం ఈ పోస్ట్ నెట్టింట వైరల్‌గా మారింది. ఆల్‌టైమ్ గ్రేట్, సిడ్నీ కింగ్ అంటూ నెటిజన్లు కామెంట్ చేస్తున్నారు. సిడ్నీ గ్రౌండ్‌లో మూడు ఫార్మాట్లలో కలిపి 13 ఇన్నింగ్స్‌లు ఆడిన రోహిత్ శర్మ.. 62.66 సగటుతో 6 హాఫ్ సెంచరీలు, 2 శతకాలతో 752 పరుగులు చేశాడు. ఈ మైదానంలో 64 ఫోర్లతో పాటు 24 సిక్స్‌లు బాదాడు. బోర్డర్ గవాస్కర్ ట్రోఫీలో భాగంగా సిడ్నీ గ్రౌండ్ వేదికగానే జరిగిన ఆఖరి టెస్ట్‌కు తుది జట్టు నుంచి స్వయంగా తప్పుకున్న రోహిత్ శర్మ.. తాజా పర్యటనలో ఇదే మైదానంలో సెంచరీతో జట్టుకు విజయాన్నందించాడు. దాంతో ఎక్కడా తగ్గాడో అక్కడే నిలబడ్డాడని ఫ్యాన్స్ కామెంట్ చేస్తున్నారు.






## డారిల్ మిచెల్ విధ్వంసం.. కివీస్ ఘన విజయం!

సొంత గడ్డపై ఇంగ్లండ్‌తో జరుగుతున్న మూడు వన్డేల సిరీస్‌లో న్యూజిలాండ్ శుభారంభం చేసింది. ఆదివారం జరిగిన తొలి మ్యాచ్‌లో సమష్టిగా రాణించిన కివీస్ 4 వికెట్ల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఇంగ్లండ్ 35.2 ఓవర్లలో 223 పరుగులకు ఆలౌటైంది. కెప్టెన్ హ్యారీ బ్రూక్(101 బంతుల్లో 9 ఫోర్లు, 11 సిక్స్‌లతో 135) ఒక్కడే విధ్వంసకర శతకంతో చెలరేగగా.. జేమీ ఓవర్టన్(54 బంతుల్లో 6 ఫోర్లు, సిక్స్‌తో 46) పర్వాలేదనిపించాడు. న్యూజిలాండ్ బౌలర్లలో జకారీ ఫౌల్క్స్(4/41) నాలుగు వికెట్లు తీయగా.. జకోబ్ డఫ్ఫీ(3/55) మూడు వికెట్లు పడగొట్టాడు. మ్యాట్ హెన్రీ రెండు వికెట్లు తీయగా.. మిచెల్ సాంట్నర్‌కు ఒక వికెట్ దక్కింది. అనంతరం న్యూజిలాండ్ 36.4 ఓవర్లలో 6 వికెట్లకు 224 పరుగులు చేసి గెలుపొందింది.

మృత్యువు కోసమే ఇక్కడికి ప్రయాణం
మరణం కోసం ప్రతిక్షణం ఎదురుచూపు
మహదానందమైన మరణాలు
అఖండంగా కాలే చితిమంటలు
శివసాన్నిధ్యంలో లయమయ్యే జీవులు
ఇక్కడ చనిపోతే పునర్జన్మ లేదు
ఈ చితిమంటల్లో కాలటమే కైలాసం
ఇక్కడ అంతిమ సంస్కారం జరిగితేనే మోక్షం

మృత్యువు.. ఈ పదం అంటే మనలో భయం లేనిదెవరికి? ఈ చావును తప్పించుకోవటానికి మనం చేయని ప్రయత్నం ఉండదు.. ఒక మనిషి బతకడని తెలిసిన తరువాత కూడా చివరి క్షణం వరకూ అతణ్ణి బతికించటం కోసం చేయాల్సిన ప్రయత్నం అంతా చేస్తాం. లక్షలు ఖర్చు చేసేందుకైనా వెనుకాడం.. మనకు చావంటే అంత భయం. కానీ, మృత్యువును కోరి ఆహ్వానించేవారూ ఉన్నారు.. వారికి మృత్యువు ఒక వరం.. దాని కోసం అంతదూరం వెళ్లి మరీ మరణాన్ని ఆహ్వానిస్తారు. దాని కోసం వేచి చూస్తారు. ఆనందంగా మరణిస్తారు. ఎందుకింత ఆనందం.. అక్కడే చనిపోవాలి.. అక్కడ చనిపోతే కైలాసంలోకి వెళ్లి శివుడిలో ఐక్యం చెందినట్లే.. సాక్షాత్తూ శివుడి సమక్షంలో మోక్షాన్ని సాధించినట్లే.. భారతీయుల్లో వేలాది ప్రజలు మృత్యువును కోరుకుంటున్న ప్రదేశం అది.



# ఏది మరణం.. ఏది మోక్షం

ఆ స్మశానం అతి ప్రవితం.. ఈశ్వరుడు తాను దగ్గరుండి జీవులను తనలో ఐక్యం చేసుకునే స్మశానం.. ఏమిటీ స్మశానం ప్రత్యేకత? ఇక్కడ అంతిమ సంస్కారం కోసం ఎందుకు తాపత్రయ పడాలి? నిజంగా మరణం తరువాత మరో జీవితం అనేది ఉంటుందా? దీని వెనుక మర్మమేమిటి? అదొక స్మశాన వాటిక. అన్నింట్లో మాదిరిగానే ఇక్కడా చనిపోయిన వారిని తీసుకువచ్చి దహన క్రియలు చేస్తుంటారు. ఇక్కడ చితి మంటలకు విరామం ఉండదు.. దహన కాండకు అంతు ఉండదు.. అనంతంగా అంతిమక్రియలు జరుగుతుంటాయి. అఖండంగా చితి మంటలు కాలుతుంటాయి. ఒకదాని వెంట ఒకటిగా శవయాత్రలు జరుగుతూనే ఉంటాయి. అంతిమ సంస్కారం కోసం క్యూలు ఉంటాయి. సమయం ఉండదు.. దహనకాండలు నిర్వహించేందుకు రోజులో ఉన్న 24 గంటలు ఎంతమాత్రం సరిపోవు. సమయం తగ్గించుకోవటానికి ఒక చితిపై మరో చితిని పేర్చేస్తారు. ఒక శవం మూడు వంతులు కాలిందో లేదో పక్కనే ఉన్న నదిలోకి తోసేసి మరో దహన కాండను చేపడతారు.. ఆ నదిలో ఆ భౌతిక దేహం భాగాలు కొట్టుకుపోతాయి.

**చూసే వాళ్లకు అసహ్యం వేస్తుంది.. జుగుప్స కలుగుతుంది. భయం వేస్తుంది. శవాల్ని పూర్తిగా దహనం కూడా చేయకుండా నదిలోకి ఎందుకు విసిరేస్తున్నారన్న ఆగ్రహమూ కలుగుతుంది.. అసలు అక్కడ వేరే స్మశానాలు లేవా? వేరే చోట దహనం చేయవచ్చు కదా? అంతిమ సంస్కారాలు ప్రశాంతంగా నిర్వహించాలన్న జిజ్ఞాస చనిపోయిన వారి బంధువులకు ఉండదా? వారిని ఏం చేసినా తప్పు లేదన్న విసుగూ కలుగుతుంది.. నిజమే చూస్తుంటే పరమ భయంకరంగా కనిపించే చోటు.. ఎక్కడో, ఎప్పుడో సినిమాల్లో నరకంలో శిక్షలను చూశాం... ఇది అలాంటిదేనా? ఈ స్మశానానికి ఎందుకింత గిరాకీ.. ఎందుకంటే ఇక్కడ సాక్షాత్తూ పరమేశ్వరుడే కాటికాపరిలా ఉన్నాడు.. ఇక్కడే ఆయన నివాసమున్నాడు.**

ఈ చితాభస్మమే ఆయన విభూతిగా మారుతోంది. ఈశ్వరుడు కొలువైన స్మశానమది. మణికర్ణికా స్మశాన ఘట్టం అది. సత్యహరిశ్చంద్రుడు కాపలాగా ఉన్న స్మశాన వాటిక అది. ఈశ్వరుడు విశ్వనాథుడిగా ఉన్న స్మశానమది. వారణాసి... బెనారస్.. కాశీ.. క్రైస్తవులకు జెరూసలేం ఎలాంటిదో.. హిందువులకు కాశీ అలాంటిది. హిందువులకు ఇంతకు మించిన ఆధ్యాత్మిక క్షేత్రం మరొకటి లేదు.. శైవక్షేత్రానికి తోడు పవిత్రమైన గంగానదీ తీరం.. ఇక్కడ పుణ్యస్నానం ఆచరించటం, దేవుణ్ణి దర్శించటం ఎంత ముఖ్యమో, ఇక్కడ చనిపోవటం అంత ముఖ్యం. ఇక్కడికి వచ్చిన వారికి ఒకటే కోరిక.. మరణించటం. అదే స్మశాన వాటికలో అంత్యక్రియలు జరగటమే పరమపదం. ఇది విపరీతం కాక మరేమిటి? వారణాసికి ఎందుకింత క్రేజి?

ఆధ్యాత్మిక క్షేత్రం అంటే అక్కడికి వెళ్లాలి.. నదిలో స్నానం చేసి, దేవుణ్ణి దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని తిరిగి వస్తాం.. కానీ, కాశీకి వెళ్తే కాటికి వెళ్లినట్లే.. కాటికి వెళ్లేందుకే కాశీకి వెళ్లాలి. దీనికి కారణం ఆ స్మశాన వాటికే.. అక్కడే దహనం కావాలి. ఆ గంగలోనే అస్థికలు కలవాలి. అప్పుడే మోక్షం కలుగుతుంది. శివసాన్నిధ్యం దొరుకుతుంది. గంగా తరంగాలలో ప్రతిధ్వనించే భక్తుల మనోరథమిది. ఎవరేమన్నా సరే.. అసహ్యమేసినా సరే.. తమ వారి శరీరాన్ని సగం కాలగానే గంగలోకి తోసేసినా సరే.. వెనక్కి తగ్గేది లేదు. అంత్యక్రియలు ఆ ఘాట్లోనే జరిగి తీరాల్సిందే. ఎందుకంటే ఇది సత్య హరిశ్చంద్రుడు కాపలా కాసిన స్మశాన వాటిక. ఈ స్మశానవాటికలో మహా విష్ణువు తన సుదర్శన చక్రంతో భూమిని కట్ చేసి బావిని ఏర్పాటు చేశాడట. ఆ బావిలో విశాలాక్షి పార్వతీదేవి చెవిరింగులు పడిపోయాయి. అందుకే ఈ స్మశాన వాటికకు మణికర్ణిక అన్న పేరు వచ్చింది. ఇక్కడ అణువణువూ భక్తి భూమిక అనంతంగా ఉంటుంది. ఒక విశ్వేశ్వరుడు మాత్రమే కాదు.. ఇది అష్టాదశ శక్తి పీఠాలలో ఒకటి. శివుడి పన్నెండు జ్యోతిర్లింగాలలో కాశీ ఒకటి. అన్నింటికీ మించి దేవనది గంగమ్మ ఈశ్వరుడి పాదాల చెంత నుండి ప్రవహిస్తున్నది. ఇన్ని ఆధ్యాత్మిక భావభూమికలు ఒకచోట కలగలిసిన ఆధ్యాత్మిక భూమి మరెక్కడా కనిపించదు. ఇక్కడి గంగా నదిలో స్నానం చేస్తే సాధారణంగా కలిగే శరీర వికారాల నుంచి ఆత్మకు స్వేచ్ఛ లభిస్తుందంటారు. ఇక్కడ విశాలాక్షిగా ఉన్న పార్వతీదేవి అన్నపూర్ణగా భక్తులను ఆదరిస్తుంది. ఎంతమంది వచ్చినా ఇక్కడ భోజనానికి లోటు ఉండదు. ఇది బెనారస్లోని ప్రత్యేకత. ఈ స్మశానాన్ని శివుడి కైలాసంగా భావిస్తారు కాబట్టే ఇక్కడ చనిపోవటం ఒక వరంగా భక్తులు విశ్వసిస్తారు.



కాశీ అంటే శివుడి మహా స్మశానం అని అర్థం. ఈ మహా స్మశానానికే శ్రీరాముడి పూర్వీకుడైన హరిశ్చంద్రుడు కాపలా కాశాడు. ధర్మాన్ని నిలబెట్టాడు. సత్యవ్రతాన్ని నిరూపించాడు. సాక్షాత్తూ ఈశ్వరుడు లయకారుడై... చనిపోయిన వారి ఆత్మలను తనలో లయం చేసుకుంటాడని బలమైన విశ్వాసం కాబట్టే ఈ మణికర్ణికాఘాట్లో అంత్యక్రియల కోసం ప్రజలు అల్లాడిపోతుంటారు. చరమాంకంలో కాశీకి వచ్చి అక్కడే శేషజీవితాన్ని గడిపేసి ఆ స్మశాన వాటికలోనే లయమైపోతారు.

చనిపోవటం వరం అనుకోవటం ఏమిటి? పిచ్చితనం కాకపోతే..? అదీ ఇంతదూరం వచ్చి చనిపోవటం విడ్డూరం కాక మరేమిటి? అదీ ఒక చితిపైన మరో చితి పేర్చటం.. ఒక శవాన్ని కాలకుండానే మరో శవాన్ని దహనం చేయటాన్ని ఎలా అంగీకరిస్తున్నారు.. మూఢనమ్మకం కాదా ఇది? దీని గురించి పర్యావరణవేత్తలూ గగ్గోలు పెడుతున్నారు.. గంగమ్మ కాలుష్యమైపోతోందని. దీనికి పరిష్కారం వెతకలేక సర్కారూ చేతులెత్తేసింది? ఎందుకింత వెర్రి? అంటే సమాధానం చెప్పటం కష్టం. మిగతా ప్రపంచానికి, మన దేశానికి లైఫ్ స్టయిల్లో చాలా తేడా ఉంటుంది. ఎంతగా వెస్టన్ కల్చర్ను మనం అడాప్ట్ చేసుకున్నా, బేసిక్స్ మాత్రం కొనసాగుతూనే ఉన్నాయి. పుట్టుక నుంచి చావుదాకా మన లైఫ్ స్టైల్ ఒక స్పెసిఫిక్ టార్గెట్తో సాగుతుంది. జీవితంలో కుటుంబం పట్ల, సమాజం పట్ల ధర్మాన్ని నిర్వర్తించటం, తగినంత సంపాదించుకోవటం, విజయం సాధించటం, జీవితంలో సుఖాలను అనుభవించటం, కోరికలు తీర్చుకోవటం, చివరకు ప్రశాంతంగా చనిపోవటం.. ఇది ఒక ట్రెడిషనల్ లైఫ్స్టైల్.. దీనికి పురాణాలు ధర్మ, అర్థ, కామ, మోక్షాలని పేర్లు పెట్టాయి. చివరిదైన మోక్షం కోసమే కాశీలోని స్మశానవాటికకు జనం వస్తారు. క్రీస్తుపూర్వం ఆరో శతాబ్దానికి ముందు నుంచే గంగానదీ తీరంలో నాగరికత అభివృద్ధి చెందుతూ వచ్చింది. అయోధ్య, మధుర, మాయ, కాశీ, కాంచీ, అవంతికా అంటూ గరుడపురాణంలోనే స్పష్టంగా కాశీ గురించి ప్రస్తావించారు. వారణాసి క్రీస్తుపూర్వం అయిదు వందల సంవత్సరాలప్పుడే ఏర్పడింది. మొదట్నుంచీ కూడా హిందూ సంప్రదాయాలను పూర్తిగా అనుసరిస్తున్న నగరం వారణాసి మాత్రమే. పుట్టడం, పెళ్లి చేసుకోవటం, జీవితంలో విజయం సాధించటం, మరణించటం.. ఇవన్నీ ఒక పద్ధతి పకారం మనిషి జీవితంలో జరగాల్సిందే. అందులో చివరిదైన మృత్యువు మాత్రం కాశీలోనే రావాలి.

కాశీ అంటే శివుడి మహా స్మశానం అని అర్థం. ఈ మహా స్మశానానికే శ్రీరాముడి పూర్వీకుడైన హరిశ్చంద్రుడు కాపలా కాశాడు. ధర్మాన్ని నిలబెట్టాడు. సత్యవ్రతాన్ని నిరూపించాడు. సాక్షాత్తూ ఈశ్వరుడు లయకారుడై... చనిపోయిన వారి ఆత్మలను తనలో లయం చేసుకుంటాడని బలమైన విశ్వాసం కాబట్టే ఈ మణికర్ణికాఘాట్లో అంత్యక్రియల కోసం ప్రజలు అల్లాడిపోతుంటారు. చరమాంకంలో కాశీకి వచ్చి అక్కడే శేషజీవితాన్ని గడిపేసి ఆ స్మశాన వాటికలోనే లయమైపోతారు. ఎందుకింత విపరీతం అన్నదానికి హేతుబద్ధత లేదు. భక్తుల విశ్వాసమే ఇందుకు ప్రాతిపదిక. భారతీయ సంస్కృతిలోని అనంతమైన మోక్ష సాధనే ఈ బలమైన కోరికకు అసలు కారణం. చనిపోయిన తరువాత ఆత్మ అనేది ఉంటుందనే నమ్మకం. ఈ ఆత్మ దేవుడిలో లీనం కావాలనే కోరిక.. ఇవన్నీ కాశీలో, అదీ మణికర్ణికా ఘాట్లో అంతిమ ఘట్టం పూర్తయినప్పుడే జరుగుతాయనే భావనకు హేతువులు వెతకటం సాధ్యమేనా? చనిపోవటాన్ని మనిషి తానుగా కోరుకోవటం మన జీవన విధానంలో ఉన్న గొప్ప లక్షణం. ఒక జీవితానికి ముగింపు ప్రశాంతంగా సాగిపోవాలి. మృత్యువు తప్పదని తెలిసి తెలిసీ, దాన్నుంచి పారిపోవటం వెర్రితనం.. ఎంతగా పారిపోయినా, అది రాకుండా పోదు. ఇది అందరికీ తెలిసినా, చివరివరకూ ఏదోరకంగా దాన్నుంచి దూరం కావటానికి ప్రయత్నిస్తారు. కానీ, కాశీకి వెళ్లిన వారికి మాత్రం జీవితం ప్రశాంతంగా ముగిసిపోవాలన్న కోరిక కలుగుతుంది. ఆ ప్రదేశంలోని గొప్పతనం అదే. అయితే శవాల దహనకాండ ఇంత దారుణంగా ఉండటాన్ని మాత్రం ఎలా అంగీకరిస్తున్నారన్నదే ఎవరికీ అంతుపట్టని ప్రశ్న. వారణాసికి ప్రతి నెలా దాదాపు లక్ష మంది యాత్రికులు వస్తుంటారు. గంగానదిలో రోజూ పవిత్ర స్నానాలు జరుగుతూనే ఉంటాయి. అదే సమయంలో ప్రతి నెలా దాదాపు రెండు నుంచి మూడు వేల మంది ఇక్కడికి వలసలు వస్తుంటారు. వీరంతా ఇక్కడే తమ జీవితాన్ని ముగించాలన్న ఉద్దేశంతో వచ్చేవారే.. ఇక్కడే చనిపోయే వారే.

కాశీ విశ్వేశ్వరుడి సన్నిధిలో, గంగానదీ తీరంలో కనీసం వంద ఘాట్లు ఉంటాయి. వీటిలో ఎక్కువ స్నాన ఘాట్లు ఉంటే క్రిమేషన్ ఘాట్లు పాతిక దాకా ఉంటాయి. వీటన్నింటికీ కూడా ఏదో ఒక స్థల పురాణం చెప్తారు. పురాణ కథ వినిపిస్తారు. ఇన్ని స్మశాన వాటికలు ఉన్నా, మణికర్ణికా ఘాటు ఉన్న డిమాండ్ సామాన్యమైంది కాదు. ఈ స్మశానవాటికలోనే ఎందుకు దహనం కావాలి? సగం కాలిన శరీరాన్ని గంగలోకి విసిరేసినా ఎందుకు ఒప్పుకోవాలి? గమ్మత్తేమిటంటే, కొందరి భౌతిక దేహాలను ఎలాంటి దహన కాండ చేయకుండానే, ఖననం లాంటి క్రియలు చేయకుండానే నేరుగా గంగలో వదిలేస్తారు. ఈ శవాలను వామాచార పద్ధతిలో రుద్రుని పూజించే అఘోరాలు సేకరించి వాటికి పూజలు చేసి ఉపాసిస్తారు. కొందరు అఘోరాలు ఈ శవాలను ఆహారంగా కూడా స్వీకరిస్తారు. సామాన్య లోకానికి అర్థం కాని భయంకరమైన జీవితాలను శవాలతో సహవాసం చేస్తూ గడుపుతారు. ఎందుకిలా జరుగుతుంది? దీనికి కారణం లేకపోలేదు.. మనిషి చనిపోయిన తరువాత స్వర్గానికి కానీ, నరకానికి కానీ వెళ్తాడనేది నమ్మకం. కాశీలో చనిపోతే నరకబాధలు ఆత్మకు ఉండవు. ఆ బాధలన్నీ తమ భౌతిక దేహానికి ఈ భూమి మీదే అనుభవంలోకి వచ్చేస్తాయి. అన్ని రకాల శిక్షలూ ఇక్కడే లభిస్తాయి. మణికర్ణికా స్మశాన వాటికలో కాటి కాపరులు శిక్షిస్తారు.. గంగానది శిక్షిస్తుంది. అఘోరాలు శిక్షిస్తారు. ఈ జన్మలోని కర్మలన్నింటికీ ఫలితాలు ఇక్కడ అంతమైనప్పుడే లభిస్తాయి. తరువాత లభించేది మోక్షమే. ఈ మోక్షం కోసమే కాశీకి జనం వెళ్తారు. ఈ మోక్షం కోసమే హరిశ్చంద్ర ఘాట్లో అంతిమ సంస్కారానికి ఆరాటపడతారు.. ఈ మోక్షం కోసమే మృత్యువును వరంగా కోరుకుంటారు. సైన్స్కు ఇది నచ్చదు. పర్యావరణానికి ఇది సరిపడదు. హేతువాదానికి ఇది అంతుపట్టదు. భక్తి, విశ్వాసాలకు ఇది పతాక సన్నివేశం. శరీరంపై అంతులేని ప్రేమకు చితిపేర్చే మహా స్మశానం. మణికర్ణిక.. మోక్ష సాధనకు ఇది చివరి స్థానం.



కోవెల సంతోష్ కుమార్
రచయిత
9052116463

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.